సంపుటి : 9
సంచిక : 334
బుధవారం
26 ఆగస్టు 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వంవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE

విశ్వంవాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
వెంటనే స్కాన్ చేయండి!
ఇప్పుడే చదవండి!
Contact For Ads:
7579339999

భారత వ్యతిరేకి మమ్దానీతో

## రేవంత్ భేటీ ఎందుకు?

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



దిల్లీ, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్ : అమెరికా పర్యటన అంశంలో కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దిల్లీలో నిర్వహించిన మీడియాలో సమావేశంలో మిగతా .. 2లో..

12, 13 తేదీల్లో

## భారత్‌కు షీ జిన్‌పింగ్



దిల్లీ, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్ : చైనా అధినేత షీ జిన్‌పింగ్ వచ్చే నెల 12, 13 తేదీల్లో భారత్ లో పర్యటించనున్నట్లు సమాచారం. దిల్లీలో మిగతా .. 2లో..

# అఖండ గోదావరిని ఆరాధించేలా పుష్కరాలు

- భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు, పవిత్రతకు పెద్దపీట
- 10 కోట్ల మంది పుణ్య స్నానాలు చేస్తారని అంచనా
- 181 కొత్త ఘాట్ల నిర్మాణంతో సహా 440 ఘాట్ల అభివృద్ధి
- మొత్తం రూ.4,026 కోట్ల వ్యయంతో 4,932 పనులు
- గోదావరి పుష్కరాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



**అమరావతి, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకృతి ఆరాధన-ఆధ్యాత్మిక చింతన మమేకం చేస్తూ గోదావరి పుష్కరాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఎక్కడా పవిత్రత దెబ్బతినకుండా, భక్తులకు సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు పుష్కరాలు అత్యంత వైభవంగా జరపాలని చెప్పారు. పుష్కరాలు కేవలం ప్రభుత్వం నిర్వహించడమే కాదని, స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. పుష్కరాల్లో భాగంగా రూ.4,026 కోట్లతో చేపట్టిన 4,932 పనులకు సంబంధించి పురోగతిపై సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సమీక్షించారు. పుష్కరాలకు ఇంకా 10 నెలల సమయమే ఉన్నందున త్వరితగతిన అన్ని పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అయితే ఈ పనులకు సంబంధించి ఇప్పటికే రూ.899 కోట్లు ఆర్థిక శాఖ కేటాయింపులు జరిగాయని అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలిపారు. వీటిలో పట్టణాభివృద్ధి, ఆర్ అండ్ బీ, జల వనరులు, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి మిగతా .. 2లో..

రాయలసీమకు

# సుజ్లాన్ భరోసా

★ రూ.10 వేల కోట్ల ప్రాజెక్టుకు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన
★ ప్రాజెక్టు ద్వారా 4,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు
★ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా కొత్త బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్ ప్రారంభం
★ అనంత, ఉరవకొండ, కల్యాణదుర్గం నియోజకవర్గాల్లో ప్రాజెక్టుల ఏర్పాటు



**రాయదుర్గం, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన రంగం కొత్త ఊపు అందుకుంది. పవన విద్యుత్ రంగంలో రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి తరలివచ్చింది. అనంతపురం జిల్లా, రాయదుర్గం నియోజకవర్గంలో ప్రఖ్యాత సుజ్లాన్ సంస్థ రూ.10,000 కోట్ల భారీ పెట్టుబడితో నెలకొల్పనున్న విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ మం గళవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 4,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిం చనున్నాయి. రాయదుర్గం నియోజక`వర్గంలోని కనేకల్లు మండలం, హులి కెర గ్రామం వద్ద ఈ భారీ ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. మొత్తం 1,325 మెగావాట్ల సామర్థ్యం తో ఏర్పాటు చేయనున్న ఈ పవన విద్యు త్ ప్రాజెక్టులను రాయదుర్గం, ఉరవ కొండ, కల్యాణదుర్గం నియోజక వర్గాల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నారు. ఈ కార్య క్రమంలోభాగంగా, సుజ్లాన్ సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎస్144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్'ను కూడా మంత్రి లోకేశ్ అధికారికంగా మిగతా .. 2లో..

ఏపీ లోకాయుక్తగా

# జస్టిస్ మల్లిఖార్జునరావు ప్రమాణ స్వీకారం

- విజయవాడలో ఆయనతో ప్రమాణం చేయించిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరు




**విజయవాడ, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ నూతన లోకా యుక్తగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ తల్లా ప్రగడ మల్లిఖార్జునరావు బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని లోక్ భవన్‌లో మంగళవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై, నూతన లోకాయుక్తగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ మల్లిఖార్జునరావుకు పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు. ప్రమాణ స్వీకారం ముగిసిన అనంతరం జస్టిస్ మల్లిఖార్జునరావు, ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్ కాసేపు ముచ్చటించారు. పరిపాలనలో పారదర్శకత, మిగతా .. 2లో..

# ఏపీలో సమ్మె విరమించిన జూనియర్ డాక్టర్లు

తమ డిమాండ్లు నెరవేర్చేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోర్టుకు విన్నపం

రెండు వారాల్లోగా తగిన నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు



**ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న జూనియర్ వైద్యుల (జూడా) సమ్మెకు తెరపడింది. తమ సమ్మెను విరమిస్తున్నట్లు జూనియర్ వైద్యుల సంఘం ప్రతినిధులు హైకోర్టుకు స్వయంగా నివేదించారు. జూనియర్ వైద్యుల మిగతా .. 2లో..

స్థానిక ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే

# వైసీపీదే విజయం

క్షేత్రస్థాయిలో శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన సమయం

కుటుంబ సభ్యులను బరిలోకి దించేందుకు వెనుకాడవద్దని పిలుపు

పోటీలు లేకుండా ఏకగ్రీవాలకు తావు ఇవ్వకూడదని హెచ్చరిక

పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి : వైసీపీ అధినేత జగన్



**అమరావతి, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగితే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తారని వైసీపీ అధినేత జగన్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ముఖ్యనేతలతో ఈరోజు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, రాబోయే స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకు సంబంధించినవి మాత్రమే కావని... క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన కీలక సమయమని జగన్ పేర్కొన్నారు. గతంలో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు చూశామన్న ఆయన.. ఈసారి ప్రతి స్థానంలోనూ సమర్థులైన, బలమైన మిగతా .. 2లో..

# కొండా సురేఖ, చిన్నారెడ్డిపై వేటు తప్పదా?..

పీసీసీకి అందిన నివేదిక



**హైదరాబాద్, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్ :** మంత్రి కొండా సురేఖ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై క్రమశిక్షణ కమిటీ రూపొందించిన నివేదిక పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు అందింది. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి, వైస్ ఛైర్మన్ శ్యామ్ మోహన్ ఈ నివేదికను మహేశ్‌కుమార్ గౌడ్‌కు అందజేశారు. కొండా సురేఖ, చిన్నారెడ్డిపై చర్యలకు కమిటీ సిఫార్సు మిగతా .. 2లో..

జగన్ కార్యాలయానికి వెళ్లినా

# న్యాయం జరగలేదు

జోగి రమేష్ కోడలు మేఘన



**విజయవాడ, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్ :** 'జోగి రమేష్ కుటుంబం వేధింపులపై విజయవాడ నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాను. దీంతో రాజీ చేసుకుందామని న్యాయవాదులతో రమేష్ మంతనాలు చేయించారు. సజ్జల రామకృష్ణారెడ్డి వద్దకు తీసుకెళ్లారు. ఆయన కాలయాపన చేశారు తప్ప ఫలితం లేదు. దీంతో మిగతా .. 2లో..

గల్లంతైన మత్స్యకారుల కోసం

# గాలింపు ముమ్మరం


15 కోస్ట్‌గార్డ్ నౌకలు, నాలుగు హెలికాప్టర్లతో విస్తృత సెర్చ్ ఆపరేషన్

మయన్మార్, బంగ్లాదేశ్ సముద్ర అధికారులకు సమాచారం.. ఎలక్ట్రానిక్ నిఘా కొనసాగింపు

మత్స్యకారులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు అన్ని అవకాశాలను వినియోగిస్తున్నాం: మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం ప్రాంతానికి చెందిన గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం చేపట్టిన గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో భారత తీర రక్షక దళం, మిగతా .. 2లో..

విశ్వం వ్యంగ్యం




# పిల్లల ద్వారా తల్లులను లోబరుచుకునే కొత్త రకం జిహాద్ ఇది



కాకినాడలో సాదిక్ అనే వ్యక్తి వేధింపులతో ఒకే కుటుంబంలో నలుగురు ఆత్మహత్య

ప్రాణాలతో బయటపడ్డ బాలుడు రియాన్ష్‌ను ఉగ్రవాదులకు అమ్ముతానని నిందితుడు బెదిరించినట్లు వెల్లడి

మతం మారాలని ఒత్తిడి చేయడంతోనే కుటుంబం ఈ దారుణ నిర్ణయం తీసుకుందని ఆరోపణ


ఘటనపై సీబీఐ విచారణ జరిపి, నిందితుడికి ఉరిశిక్ష విధించాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ డిమాండ్

బాధిత బాలుడికి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ

**కాకినాడ, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రశాంతతకు మారుపేరైన కాకినాడ నగరంలో జరిగిన ఒక దారుణ ఘటన యావత్ రాష్ట్రాన్ని ఉలిక్కి పడేలా చేసింది. సాదిక్ అనే వ్యక్తి పెట్టిన చిత్ర హింసలు, వేధింపులు, బ్లాక్‌మెయిలింగ్ తట్టుకోలేక ఒకే కుటుంబానికి చెందిన మిగతా .. 2లో..

# 'ఆ సరస్సు పేరు మారుస్తాం'..

కెనడాతో ట్రంప్ మరో చిచ్చు



**ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్ :** కెనడాతో వాణిజ్య విభేదాలు కొనసాగుతున్న వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'ట్రూత్ సోషల్' వేదికగా కీలక పోస్ట్ పెట్టారు. కెనడా, అమెరికాలతో సరిహద్దు పంచుకుంటున్న 'లేక్ అంటారియో' పేరును 'లేక్ అమెరికా'గా మార్చే ప్రతిపాదనను సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. తాము ఇకపై మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# అఖండ గోదారిని ఆరాధించేలా పుష్కరాలు

అత్యధిక పనులు ఉన్నాయి. ఇందులో తూర్పు గోదావరి జిల్లాలో 1,869, పశ్చిమ గోదావరి జిల్లాలో 625, కోనసీమ జిల్లాలో 1,501, ఏలూరు జిల్లాలో 426, కాకినాడ జిల్లాలో 321, పోలవరం జిల్లాలో 190 పనులు చేపడుతున్నారు. అయితే ఈ పనుల పూర్తికి అవసరమైన నిధుల సమీకరణపై అధికారులు దృష్టి పెట్టాలని, కేంద్ర సాయం కూడా తీసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు.

**2027 పుష్కరాలకు భారీగా భక్తులు**

2015 మహా పుష్కరాల్లో ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 4.86 కోట్ల మంది భక్తులు పుణ్య స్నానాలు చేయగా. 2027లో 8 నుంచి 10 కోట్ల మంది గోదావరి పుష్కరాలకు తరలి వస్తారని అంచనా వేస్తున్నట్టు అధికారులు వివరించారు. రోజుకు సుమారు కోటి మంది పుణ్య స్నానాలు చేసే అవకాశం ఉందన్నారు. రద్దీని తట్టుకునేలా మొత్తం 440 ఘాట్లు సిద్ధం చేస్తున్నామన్నారు. వీటిలో ప్రస్తుతం ఉన్న 259 ఘాట్లను అభివృద్ధి చేయడంతో పాటు అదనంగా 181 కొత్త ఘాట్లను నిర్మిస్తున్నామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 82 ఘాట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 40 ఘాట్లు, కోనసీమ జిల్లాలో 175 ఘాట్లు, ఏలూరు జిల్లాలో 44 ఘాట్లు, కాకినాడ జిల్లాలో 88 ఘాట్లు, పోలవరం జిల్లాలో 11 ఘాట్లు అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు.

**టెంపుల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి**

గోదావరి పరివాహక ప్రాంతంలో ఎన్నో పుణ్యక్షేత్రాలు ఉన్నాయని... పిఠాపురంలో శక్తి పీఠం సహా పంచారామాల్లో 4 క్షేత్రాలు, ఇంకా ద్వారకా తిరుమల, అన్నవరం, వాడపల్లి, అంతర్వేది వంటి ప్రధాన ఆలయాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తులు పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించేందుకు వీలుగా హోం స్టేలను ప్రోత్సహించాలని సూచించారు. కొత్తగా హోటళ్ల నిర్మాణం చేపట్టేవారికి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలన్నారు. సమీక్షలో ఇంకా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'రాజమహేంద్రవరంలో వివిధ కార్యక్రమాల నిర్వహణ కోసం కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలి. దేశ విదేశాల్లో ప్రముఖులు అందరికీ గోదావరి పుష్కరాలకు ఆహ్వానం అందించాలి. రాష్ట్ర విశిష్టత తెలిసేలా, ప్రతిష్ట పెరిగేలా చేసేందుకు ఇదొక అవకాశంగా భావించాలి. కూచిపూడి ఈవెంట్ వంటివి భారీ తరహాలో నిర్వహించేలా దేవా దాయ-పర్యాటక శాఖలు ప్రణాళికలు రూపొందించాలి. పుష్కర ఘాట్లను కలిపే రహదారుల నిర్మాణం సహా, పుష్కరాలు జరిగే 6 జిల్లాలో ఏ రోడ్లపైనా గుంతలు కనిపించకూడదు. పోలవరం ప్రాజెక్టును సందర్శించేలా రహదారుల నిర్మాణం జరగాల్సి ఉంది. బ్రిడ్జిల సామర్థ్యాన్ని పరిశీలించి, దానికి అనుగుణంగా మరమ్మతులు చేయాలి. గోదావరిలో చుక్క కూడా మురుగు నీరు కలవకుండా చూడాలి. అధికారులు ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలి. హేవ్‌లాక్ బ్రిడ్జి, సమీపంలో దీవుల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి.' అని నిర్దేశించారు.

**రద్దీ నిర్వహణకు ఏఐ వినియోగం**

ఈసారి పుష్కరాల్లో భద్రత, రద్దీ నిర్వహణకు ఏఐ ఆధారిత క్రౌడ్ అనలిటిక్స్, సీసీటీవీ ఎంట్రీ-ఎగ్జిట్ మానిటరింగ్, డ్రోన్ సర్వైలెన్స్, క్యూఆర్ ఆధారిత వాహన గుర్తింపు, డీసెంట్రలైజ్డ్ డిప్లాయ్‌మెంట్ సిస్టమ్ వంటి సాంకేతికత వినియోగిస్తున్నట్టు అధికారులు తెలిపారు. వైద్య సేవల పరంగానూ ఎటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అంబులెన్స్‌లు, ఫస్ట్ ఎయిడ్, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు. 30 ఫీల్డ్ ఆస్పత్రులను తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేసి, వాటికి అనుబంధంగా ల్యాబ్‌లు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

**మోడల్ పుష్కర పంచాయతీగా ముని కూడలి**

గోదావరి నదీ పరివాహక జిల్లాల్లోని 260 గ్రామ పంచాయతీలలో 50 గ్రామ పంచాయతీలను మోడల్ పుష్కర పంచాయతీలుగా అభివృద్ధి చేయ తలపెట్టారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని ముని కూడలిని పైలట్ మోడల్ పుష్కర పంచాయతీగా ఎంపిక చేశారు. కొవ్వూరు--పోలవరం మీదుగా పట్టిసీమ రోడ్డు, సీతానగరం నుంచి సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వరకు దీ రోడ్డు, అలాగే అవెన్యూ ప్లాంటేషన్, బ్యూటిఫికేషన్... సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ నుంచి కొవ్వూరు వరకు రోడ్లు అభివృద్ధి చేయనున్నారు. రాజమహేంద్రవరం--పోలవరం మధ్య జాతీయ రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పుష్కరాలు కాలుష్య రహితంగా చేసేందుకు 487 గ్రీన్ ఎనర్జీ బస్సులు వినియోగించనున్నారు. అలాగే 11 బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. నదిలో భక్తుల భద్రతకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. 2,697 రెస్క్యూ బోట్లు సిద్ధం చేయడంతో పాటు, 8,955 శిక్షణ పొందిన ఈతగాళ్లను పుష్కరాల సమయంలో నియమించనున్నారు.

**అఖండ గోదావరికి పుష్కర ఏర్పాట్లు**

గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు, దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రపంచస్థాయి మౌలిక వసతులు, రవాణా, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు, భద్రత, వసతి, సాంకేతిక పరిజ్ఞానంతో సమగ్ర ఏర్పాట్లను అద్భుతంగా చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. గోదావరి జన్మస్థానం నుంచి సముద్ర సంగమం వరకు అనేక ఉప నదులు, వాగులు, ఏరులు కలుస్తున్నందున 'అఖండ గోదావరి' పేరుతో పుష్కరాలు నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డి, వై సత్యకుమార్ యాదవ్, గోదావరి పుష్కరాల ప్రత్యేకాధికారి, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రేవంత్ భేటీ ఎందుకు?

ఆయన మాట్లాడారు. "కేంద్రం అనుమతి రాకుండానే రేవంత్‌రెడ్డి ఆదరాబాదరాగా అమెరికా పర్యటన చేపట్టారు. అర్హతలేని వ్యక్తులను సీఎం తన పర్యటనలో కలవాలని నిర్ణయించుకున్నారు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. యూఎస్ పర్యటనపై రేవంత్‌రెడ్డి స్పష్టమైన వివరణ ఇవ్వలేదు. విదేశాంగశాఖ అనుమతి ఇవ్వకపోవడానికి రాజకీయాలు ఆపాదించడం సరికాదు. 2005లో గుజరాత్ సీఎంగా మోదీ ఉన్నప్పుడు అమెరికా పర్యటనను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంది. గతంలో మరి కొందరు సీఎంల విదేశీ పర్యటనలకూ కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. సొంత పార్టీ సీఎంలకు కూడా అనుమతి ఇవ్వని సందర్భాలు ఉన్నాయి. విదేశాల్లో మన సీఎంలు ఎవరిని కలుస్తారు.. వాటితో దేశానికి ఏం ప్రయోజనం అనేది విదేశాంగశాఖ పరిశీలిస్తుంది. మన దేశ విదేశాంగ విధానాన్ని బట్టే కేంద్రం అనుమతి ఇస్తుంది. పాక్‌కు అనుకూలంగా ఉంటూ మన దేశంపై విషం చిమ్మే వ్యక్తి న్యూయార్క్ మేయర్ మమ్దానీ. భారత ప్రధాని మోదీని ఆయన గతంలో దూషించారు. న్యూయార్క్‌లో హిందువులు నిర్వహించుకునే పండుగలపై ఆంక్షలు విధించారు. అలాంటి వ్యక్తిని కలవాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించుకున్నట్లు వార్తలు వచ్చాయి. భారత వ్యతిరేకితో రేవంత్ భేటీ ఎందుకు? కేవలం పరిపాలనా పరమైన కారణాలతోనే విదేశాంగశాఖ రేవంత్ పర్యటనకు అనుమతి ఇవ్వలేదు. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి తన స్థాయికి తగిన వారితో చర్చించాలి. విదేశాలకు సీఎం వెళ్లకుండా కూడా పెట్టుబడులు సాధించవచ్చు. అధికారులను పంపించి కూడా పెట్టుబడులు, ఒప్పందాలు సాధించవచ్చు" అని కిషన్‌రెడ్డి అన్నారు.

# సుజ్లాన్ భరోసా

ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి, ప్రాజెక్టుకు సంబంధించిన ఆడియో విజువల్ (ఏవీ) ప్రదర్శనను వీక్షించారు. అంతకుముందు బళ్లారి సమీపంలోని హలకుంది గ్రామంలో ఉన్న సుజ్లాన్ బ్లేడ్ స్టాక్ యార్డును మంత్రి సందర్శించి, అక్కడి విండ్ టర్బైన్‌పై తన సంతకం చేశారు. ఈ సందర్భంగా సుజ్లాన్ ప్రతినిధులు ప్రాజెక్టు విశేషాలను మంత్రికి వివరించారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో 1,700 మెగావాట్లకు పైగా స్థాపిత సామర్థ్యంతో అతిపెద్ద విండ్ భాగస్వామిగా ఉన్న సుజ్లాన్, తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. 2030 నాటికి రాష్ట్రంలో అదనంగా మరో 5,000 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను స్థాపించడమే లక్ష్యంగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. పవన విద్యుత్ ఉత్పత్తిలో ఏపీని కీలక కేంద్రంగా మార్చేందుకు ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కీలక కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా జి. లక్ష్మీనారాయణ, స్థానిక ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు (రాయదుర్గం), అమిలినేని సురేంద్రబాబు (కల్యాణదుర్గం), దగ్గుపాటి వెంకట ప్రసాద్ (అనంతపురం అర్బన్) పాల్గొన్నారు. సుజ్లాన్ గ్రూప్ తరపున కో-ఫౌండర్, వైస్ ఛైర్మన్ గిరీష్ తంతి, సీఈవో అజయ్ కపూర్, అడ్వైజర్ వి.బి. రావు, ఇతర భాగస్వామ్య సంస్థలైన టాటా పవర్ ఎండీ సంజయ్ బంగా, టోరెంట్ పవర్ డైరెక్టర్ జిగీష్ మెహతా, వారీ ఎనర్జీస్ సీఎండీ హితేష్ దోషి, ఎన్ఆర్ఈడీసీఏపీ లిమిటెడ్ వీసీ, ఎండీ ఎమ్. కమలాకర బాబు, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తదితర ప్రముఖులు హాజరయ్యారు.

# 12, 13 తేదీల్లో భారత్‌కు షీ జిన్‌పింగ్

జరగనున్న బ్రిక్స్ సదస్సుల్లో పాల్గొనేందుకు ఆయన భారీ బృందంతో వచ్చే అవకాశముందని తెలిసింది. ఆయన వస్తే ఏడేళ్ల తర్వాత భారత్‌కు రావడం ఇదే తొలిసారి అవుతుంది. కాగా భారత జాతీయ భద్రత సలహాదారు అజీత్ డోభాల్ సోమవారం చైనా రాజధాని బీజింగ్‌కు చేరుకున్నారు. ఆయన రెండు రోజులపాటు ఆ దేశంలో పర్యటించనున్నారు. సరిహద్దు అంశాలపై మంగళవారం జరిగే రెండు దేశాల ప్రత్యేక ప్రతినిధుల సమావేశంలో పాల్గొంటారు. చైనా విదేశాంగశాఖ మంత్రి, జాతీయ భద్రత సలహాదారు అయిన వాంగ్ ఈ తోనూ ఆయన సమావేశమవుతారు.

# జస్టిస్ మల్లిఖార్జునరావు ప్రమాణ స్వీకారం

అవినీతి నిర్మూలనకు లోకాయుక్త వ్యవస్థ ప్రాధాన్యాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేసుకున్నారు. అనంతరం లోక్‌భవన్‌లో ఏర్పాటు చేసిన అల్పాహార విందులో గవర్నర్, ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్న తాధికారులు, న్యాయశాఖకు చెందిన ప్రముఖులు హాజ రయ్యారు. జస్టిస్ మల్లిఖార్జునరావు నియామకంతో రాష్ట్రంలో పరిపాలన మరింత జవాబుదారీగా మారుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఏపీలో సమ్మె విరమించిన జూనియర్ డాక్టర్లు

సమ్మెపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టు ఈరోజు విచారణ చేపట్టింది. ఈ విచారణ సందర్భంగా, విధుల్లోకి చేరుతున్నామని చెబుతూనే సమ్మెను విరమిస్తున్నట్లు జూడాలు న్యాయస్థానానికి స్పష్టం చేశారు. అదే సమయంలో, తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేలా రాష్ట్ర ప్రభుత్వానికి తగిన ఆదేశాలు జారీ చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. జూనియర్ వైద్యులు లేవనెత్తిన డిమాండ్లపై సానుకూలంగా స్పందించిన హైకోర్టు, వారి సమస్యల పరిష్కారంపై రెండు వారాల్లోగా తగిన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కోర్టు ఇచ్చిన ఈ స్పష్టమైన ఆదేశాలతో జూనియర్ వైద్యులు తమ నిరసనను ఉపసంహరించుకోవడంతో, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు తిరిగి సాధారణ స్థితికి చేరుకున్నాయి.

# వైసీపీదే విజయం

అభ్యర్థులను పోటీకి దింపాలని సూచించారు. అవసరమైతే నాయకులు తమ కుటుంబ సభ్యులను సైతం బరిలోకి దించేందుకు వెనకాడకూడదని పిలుపునిచ్చారు. ఏ నియోజకవర్గంలోనూ పోటీ లేకుండా ఏకగ్రీవాలకు తావు ఇవ్వకూడదని... ఒకవేళ ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే అక్కడి కో-ఆర్డినేటర్లు భవిష్యత్తులో అసెంబ్లీ అభ్యర్థులుగా కొనసాగలేరని హెచ్చరించారు. పార్టీ కేడర్ బలోపేతం కోసం 14 నుంచి 15 లక్షల క్యూఆర్ కోడ్ ఆధారిత గుర్తింపు కార్డులు సిద్ధమయ్యాయని... సెప్టెంబరు 5 నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించి వీటిని పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. 'వెన్నుపోటు పార్టీ - వెన్నుపోటు పాలన' అనే నినాదంతో గ్రామ స్థాయిలో వైసీపీ - కూటమి పాలన మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలను రక్షించుకోవడానికి నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు లీగల్, మీడియా సెల్స్‌ను బలోపేతం చేయాలని... అవసరమైతే కేసులు హైకోర్టు వరకు తీసుకెళ్లేలా సమన్వయ వ్యవస్థ ఉండాలని తెలిపారు. అలాగే సోషల్ మీడియాను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని, 'జగన్ 2.0 సూపర్ యాప్', యూట్యూబ్, ఎక్స్ వంటి వేదికల ద్వారా నిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరుతూ, రాజకీయ ఒత్తిళ్లతో చట్టవిరుద్ధంగా వ్యవహరించే అధికారుల పేర్లను డిజిటల్ బుక్‌లో నమోదు చేసి, భవిష్యత్తులో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాయకులు తమ ఈగోలను పక్కనపెట్టి, రాబోయే 60-70 రోజులు నియోజకవర్గాల్లోనే ఉంటూ స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# కొండా సురేఖ, చిన్నారెడ్డిపై వేటు తప్పదా?..

చేసినట్లు సమాచారం. కుమార్తె సుస్మిత వ్యాఖ్యలను సురేఖ ఖండించాల్సిందని కమిటీ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది.

**హద్దులు దాటిన నేతలకు స్పష్టమైన హెచ్చరిక: మల్లు రవి**

నివేదిక సమర్పించిన అనంతరం గాంధీభవన్‌లో క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి మీడియాతో మాట్లాడారు. కొండా సురేఖ, చిన్నారెడ్డి ఇచ్చిన వివరణ ఆధారంగా పీసీసీ అధ్యక్షుడికి నివేదిక ఇచ్చామని చెప్పారు. కాంగ్రెస్ (జశీఅస్త్రతీవంం) గౌరవాన్ని దెబ్బతీసే పనులు ఎవరూ చేయొద్దని.. వచ్చే ఎన్నికల్లో పార్టీకి నష్టం కలిగేలా ఎవరూ మాట్లాడవద్దన్నారు. "అన్ని అంశాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇచ్చాం. హద్దులు దాటిన నేతలందరికీ స్పష్టమైన హెచ్చరిక ఇవ్వాల్సి ఉంది. క్రమశిక్షణా చర్యలు కఠినంగా ఉండాలని నివేదిక ఇచ్చాం. అందులో ఏముందో ముందే చెబితే అధిష్ఠానం నుంచి నాకు నోటీసులు వస్తాయి. పార్టీ అంతర్గత వ్యవహారాలను ఎవరూ బయటపెట్టొద్దని ప్రధానంగా నివేదికలో పేర్కొన్నాం. కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యక్తిగతంగా కలవలేదు. గాంధీభవన్‌లో వివరణ లేఖ ఇచ్చి వెళ్లారు. ఈ నివేదికను సీఎం రేవంత్‌కు ఇవ్వలేదు. పార్టీకి సంబంధించిన విషయం కాబట్టి పీసీసీ అధ్యక్షుడికి అందజేశాం. ఈ విషయంలో ఊహాజనిత అంశాలు ప్రచారం చేయొద్దు. ఈ నివేదికను పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌కు పంపారు. ఏఐసీసీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శికి కూడా పంపిస్తారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయి'' అని మల్లు రవి అన్నారు.

**అధిష్ఠానం నిర్ణయంపై ఉత్కంఠ..**

కొండా సురేఖ, చిన్నారెడ్డిపై పీసీసీ అధ్యక్షుడికి సమర్పించిన నివేదికలో క్రమశిక్షణ కమిటీ పలు సిఫార్సులు చేసినట్లు సమాచారం. "పార్టీ నియమాలను కొండా సురేఖ ఉల్లంఘించడం ఇది మూడోసారి. ఇంకా ఉపేక్షిస్తే పార్టీకి తీరని నష్టం వాటిల్లుతుంది. సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలి. సీనియర్ నేతగా ఉన్న చిన్నారెడ్డి పార్టీలో సుదీర్ఘకాలం ఎన్నో పదవులు అనుభవించారు. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌గానూ పనిచేశారు. ఆయన కూడా పార్టీకి నష్టం కలిగించేలా మాట్లాడారు. క్యాబినెట్ ర్యాంకు పదవిలో ఉన్న చిన్నారెడ్డిని కూడా ఆ పదవి నుంచి తొలగించాలి" అని క్రమశిక్షణ కమిటీ సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. కమిటీ నివేదిక నేపథ్యంలో ఈ ఇద్దరు నేతలపై కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకునే నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది.

# న్యాయం జరగలేదు

జగన్ కార్యాలయానికి వెళ్లినా.. ఆయన కలవలేదు, మాకు న్యాయం జరగలేదు' అని మాజీ మంత్రి జోగి రమేష్ కోడలు మేఘన వాపోయారు. పెళ్లి తర్వాత అత్తవారింట పడిన ఇబ్బందులపై మంగళవారం విజయవాడలో విలేకర్లతో మాట్లాడారు. అప్పుడు సజ్జలను కలిసినట్లే ఇప్పుడు వసంత కృష్ణప్రసాద్‌నూ న్యాయం కోసమే కలిశానంటూ జోగి వ్యాఖ్యలకు బదులిచ్చారు. చంద్రబాబు, లోకేశ్‌ను తాము కలిసినట్లు జోగి ఆరోపిస్తున్నారని, అందులో వాస్తవం లేదన్నారు. పెళ్లయిన రెండు నెలలకే తన భర్త రాజీవ్ విడాకుల పిటిషన్ దాఖలుచేస్తే.. కోర్టు దాన్ని కొట్టేసిందని తెలిపారు. కుమారుడికి సమస్య ఉందని తెలిసినా, పెళ్లిచేసి తన గొంతు కోయడం నేరమన్నారు. తనకు విడాకులిచ్చి విముక్తి కల్పించాలని, న్యాయం జరిగేవరకూ పోరాడతానని మేఘన స్పష్టం చేశారు.

**ఇద్దరు భార్యలున్నవారు దేవుళ్లు ఎలా అవుతారు?**

'పెళ్లికి ముందు జోగి కుటుంబం తాము హిందువులమని మోసం చేసింది. పెళ్లి తర్వాతే వారు క్రైస్తవమతం పాటిస్తున్నట్లు తెలిసింది. మతం మారాలని జోగి భార్య శకుంతల బలవంతం చేశారు. ఇద్దరు భార్యలున్నవాళ్లు దేవుళ్లు ఎందుకు అవుతారని అవహేళన చేశారు' అని మేఘన తెలిపారు. 'పెళ్లైన నెలరోజుల నుంచే అదనపు కట్నం కోసం వేధింపులు మొదలుపెట్టారు. రాజీవ్ నాతో సరిగ్గా ఉండని విషయం శకుంతలకు చెబితే.. అదనపు కట్నం తీసుకొస్తేనే రాజీవ్‌కు ఫీలింగ్స్ వస్తాయన్నారు. జోగి రమేష్ ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ ఆయన నన్ను కూతురిలా భావించానని, శకుంతల తల్లిలా చూసుకుంటారని చెప్పారు. కానీ, వారు అలా తల్లిలా గోరుముద్దలు తినిపిస్తే నాకీ ఇబ్బందులు ఎందుకు? అవి గోరుముద్దలు కావు.. విషపు ముద్దలు. నా భద్రత కోసం తీసిన వీడియోలను ఏఐ వీడియోలంటూ ప్రచారం చేస్తున్నారు. అవి నిజమైనవేనని నిరూపిస్తాం' అని ఆమె చెప్పారు.

**జోగి ఇంటిముందు ధర్నా చేస్తాం**

మేఘన తండ్రి అనంత కృష్ణగౌడ్ మాట్లాడుతూ 'కుమారుడి లోపాలు తెలిసినా పెళ్లి ఎందుకు చేశారో జోగి రమేష్ సమాధానం చెప్పాలి. అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. మాకు న్యాయం జరగని పక్షంలో రమేష్ ఇంటిముందు కుటుంబంతో ధర్నా చేస్తా. సీఎం చంద్రబాబు, లోకేశ్ మాకు న్యాయం చేయాలి' అని కోరారు.

# గాలింపు ముమ్మరం

నౌకాదళం, ఇతర సంబంధిత విభాగాలు సమన్వయంతో విస్తృత సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అమలాపురం పార్లమెంట్ సభ్యులు హరీష్ బాలయోగి మంగళవారం కేంద్ర రక్షణ మంత్రిని కలిసి గల్లంతైన మత్స్యకారుల కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలపై చర్చించిన అనంతరం కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ భారత తీర రక్షక దళాన్ని మరింత అప్రమత్తం చేసిందని మంత్రి తెలిపారు. ఐసీజీ ప్రధాన కార్యాలయంలోని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఆపరేషన్స్) ఆదేశాల మేరకు కోల్‌కతాలోని తూర్పు, ఈశాన్య కమాండ్లను కూడా కార్యాచరణలోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. గాలింపు పరిధిని విస్తరించి, ఆపరేషన్‌ను వేగవంతం చేసేందుకు సమీప సముద్ర జలాల్లో ఉన్న 15 ఐసీజీ నౌకలు, నాలుగు హెలికాప్టర్లను మంగళవారం రంగంలోకి దించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. మెరైన్ రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ నిఘా ఏకకాలంలో కొనసాగుతోందన్నారు. గల్లంతైన పడవకు సంబంధించిన సమాచారం లేదా ఆచూకీ లభించే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని మయన్మార్, బంగ్లాదేశ్ సముద్ర అధికారులను కూడా అప్రమత్తం చేసినట్లు తెలిపారు. పడవ విదేశీ జలాల్లోకి కొట్టుకుపోయి ఉండవచ్చనే అవకాశంతో పాటు, ఇంజిన్‌లో సాంకేతిక లోపం కారణంగా సముద్రంలో ఎక్కడైనా నిలిచిపోయి ఉండవచ్చన్న కోణంలోనూ భారత తీర రక్షక దళం పరిశీలన జరుపుతోందని మంత్రి వివరించారు. ఎంఆర్‌సీసీ చేపడుతున్న ఎలక్ట్రానిక్ నిఘాతో పాటు వివిధ సముద్ర అధికారుల నుంచి అందుతున్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషిస్తున్నట్లు చెప్పారు. సముద్ర ప్రవాహాలు, గాలుల దిశ, వేగం, వాతావరణ పరిస్థితులతో పాటు మత్స్యకారులు సాధారణంగా చేపల వేటకు వెళ్లే మార్గాలను పరిగణనలోకి తీసుకుని గాలింపు కొనసాగిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. డైమండ్ హార్బర్, సుందర్‌బన్స్‌తో పాటు పరిసర సముద్ర ప్రాంతాల్లోనూ సెర్చ్ ఆపరేషన్‌ను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, కేంద్ర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకుంటోందని అచ్చెన్నాయుడు చెప్పారు. గల్లంతైన మత్స్యకారులను సురక్షితంగా తిరిగి తీసుకురావడానికి అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగిస్తున్నామని స్పష్టం చేశారు. మత్స్యకారుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని మంత్రి కోరారు.

# పిల్లల ద్వారా తల్లులను లోబరుచుకునే కొత్త రకం జిహాద్ ఇది

నలుగురు ఆత్మహత్యకు పాల్పడగా, వారిలో 13 ఏళ్ల బాలుడు రియాన్ష్ మాత్రం అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. కళ్లెదుటే తన కుటుంబం మొత్తం జలసమాధి అవుతున్న దృశ్యాన్ని చూసిన ఆ చిన్నారి చెప్పిన వాస్తవాలు గుండెలు పిండేస్తున్నాయి. ఈ ఘటన వెనుక ఉన్న ఘోరమైన కుట్రను, నిందితుడి పైశాచికత్వాన్ని జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మీడియా ముందు ఆ బాలుడితో సహా హాజరై వివరించారు. కాకినాడకు చెందిన ప్రముఖ మానేపల్లి జువెలర్స్ కుటుంబానికి చెందిన జగదీశ్ రెడ్డి, ప్రభుత్వ ఉద్యోగిని అయిన ఆయన భార్య, ఆమె తల్లిదండ్రులు.. ఈ నలుగురి మృతికి సాదిక్ అనే వ్యక్తి కారణమని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తీవ్రంగా ఆరోపించారు. వారి కుమారుడైన రియాన్ష్ ప్రాణాలతో బయటపడి అసలు నిజాలను వెల్లడించాడని తెలిపారు. రియాన్ష్ కథనం ప్రకారం, షూటింగ్ కోచ్ అయిన సాదిక్.. మొదట తండ్రి జగదీశ్ రెడ్డిని లక్ష్యంగా చేసుకున్నాడు. ముంబై, కెనడా నుంచి ప్రమాదకర రసాయనాలు తెప్పించి, వాటిని ప్రోటీన్ షేక్‌లలో, ఆహారంలో కలిపి ఇచ్చి నెమ్మదిగా ఆయన్ను అనారోగ్యం పాలు చేసి, చివరికి ప్రాణాలు తీశాడని బాలుడు తెలిపాడు. ఈ విషయాన్ని చనిపోయే ముందు తల్లి రాసిన లేఖలో స్పష్టంగా పేర్కొన్నారని ఎంపీ వెల్లడించారు. ఆమె భర్త మరణం తర్వాత, సాదిక్ తన నిజ స్వరూపాన్ని బయటపెట్టాడు. రియాన్ష్ తల్లిని శారీరకంగా, మానసికంగా తీవ్రంగా హింసించడం మొదలుపెట్టాడు. ఆమెను రహస్యంగా వీడియోలు తీసి, వాటితో బ్లాక్‌మెయిల్ చేస్తూ ఆస్తులను తన పేరు మీద రాయించుకున్నాడు. బ్యాంకు ఖాతాలకు అనుసంధానమైన ఫోన్ నంబర్లను మార్చేసి, ఆర్థికంగా వారిని పూర్తిగా నిర్వీర్యం చేశాడు. "నువ్వు ఎవరికైనా చెబితే, నీ కొడుకు రియాన్ష్‌ను ఉగ్రవాదులకు అమ్మివేస్తాను. నాకు అంతటా సంబంధాలున్నాయి" అని బెదిరించడంతో ఆ తల్లి బిడ్డ ప్రాణాల కోసం అన్నింటినీ సహించింది. ఫోన్‌కు ట్రాకింగ్ యాప్‌లు పెట్టి, 24 గంటలూ నిఘా నీడలో బంధించాడు. అన్నింటినీ వదులుకోవడానికి సిద్ధపడిన ఆ తల్లిని, సాదిక్ చివరిగా ఒక ఘోరమైన షరతు విధించాడు. "నువ్వు హిందూ మతాన్ని వదిలి ఇస్లాం స్వీకరించాలి. మతం మారితేనే నిన్ను, నీ కొడుకును వదిలిపెడతా" అని ఒత్తిడి చేశాడు. చిన్నప్పటి నుంచి దైవభక్తి, సంప్రదాయాలతో పెరిగిన ఆమె, ఆస్తులు, బంధాలు అన్నింటినీ వదులుకున్నా, తన ధర్మాన్ని, నమ్మకాన్ని వదులుకోవడానికి సిద్ధపడలేదు. ఈ క్రమంలోనే, తన కొడుకును ఉగ్రవాదిగా మార్చేస్తాడేమోనన్న భయంతో, తన ధర్మాన్ని కాపాడుకోవడం కోసం, కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకోవాలని ఆ తల్లి కఠిన నిర్ణయం తీసుకుంది. ఆత్మహత్యకు ముందు రోజు, కుటుంబ సభ్యులంతా కారులో నాలుగు గంటల పాటు మౌనంగా ప్రయాణించారు. సాదిక్ తమను ట్రాక్ చేస్తున్నాడేమోనన్న భయంతో ఒక్క మాట కూడా మాట్లాడుకోలేదు. వారధి వద్దకు చేరుకున్నాక, మొదట తల్లి, కుమారుడు రియాన్ష్ నీటిలోకి దూకారు. ఆ తర్వాత కాసేపటికి తాత, అమ్మమ్మ కూడా దూకారు. ఈత వచ్చిన రియాన్ష్ 40 నిమిషాల పాటు నీటిలో పోరాడుతుండగా, మత్స్యకారుల బోటు వచ్చి అతన్ని కాపాడింది. నీటిలో కొట్టుకుపోతూ కూడా, "అమ్మా, నువ్వు బతికి నీ స్నేహితుల దగ్గరికెళ్లిపో. వాడి కంట పడకు. నా కళ్ల ముందే నువ్వు చావడం నేను చూడలేను" అని రియాన్ష్ తన తల్లితో చెప్పిన చివరి మాటలు అక్కడి వారిని కంటతడి పెట్టించాయి.

**ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ డిమాండ్లు, ప్రభుత్వానికి విజ్ఞప్తి**

ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. "పెహల్గామ్‌లో 26 మందిని చంపిన ఉగ్రవాదుల గురించి దేశం మొత్తం మాట్లాడుకుంది. ఇక్కడ ఒక్కడే నలుగురిని చంపాడు. వాళ్లకంటే పెద్ద టెర్రరిస్ట్ వీడు. ఇలాంటి వాడిని ఉరితీయాలి" అని ఉద్వేగంగా అన్నారు. ఈ కేసును వెంటనే సీబీఐకి అప్పగించాలని, నిందితుడి వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను, ఢిల్లీ సంబంధాలను, అతని ద్వారా మోసపోయిన ఇతర బాధితుల వివరాలను వెలికితీయాలని కోరారు. ఇది సాధారణ ఘటన కాదని, పిల్లల ద్వారా కుటుంబాల్లోకి ప్రవేశించి, తల్లులను లోబరుచుకుని, బ్లాక్‌మెయిల్ చేసి మత మార్పిడులకు పాల్పడే ఒక "కొత్త రకం లవ్ జిహాద్" అని ఆయన అభివర్ణించారు. జిల్లా కలెక్టర్‌ను కలిసి, సాదిక్ కబ్జా చేసిన ఆస్తులన్నింటినీ తిరిగి రియాన్ష్ పేరు మీదకు మార్చాలని, తండ్రికి ప్రభుత్వం నుంచి రావలసిన బిల్లులను బాలుడికి అందజేయాలని, అతని చదువు, భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. బాలుడికి భరోసా ఇస్తూ, "నీకు నేనున్నాను, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ, మొత్తం ప్రభుత్వం, మీడియా నీ వెంటే ఉన్నాయి. భయపడకు" అని ధైర్యం చెప్పారు. నిందితుడి తరపున ఏ న్యాయవాది వాదించవద్దని కాకినాడ బార్ అసోసియేషన్‌కు కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. సనాతన ధర్మాన్ని కాపాడకపోతే ఇలాంటి దుర్మార్గులు చెలరేగిపోతారని, అందుకే పవన్ కల్యాణ్ మొదటి నుంచి దీని ప్రాముఖ్యతను చెబుతున్నారని గుర్తుచేశారు. ఈ దారుణ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, దోషులకు కఠిన శిక్ష పడే వరకు పోరాడతామని ఆయన స్పష్టం చేశారు.

# 'ఆ సరస్సు పేరు మారుస్తాం'..

ఆంటారియోతో పెద్దగా వాణిజ్యం చేయాలనుకోవడం లేదని పేర్కొన్నారు. ఒకవేళ అగ్రరాజ్యం తమపై సుంకాలను విధిస్తే.. ఆ దేశానికి విద్యుత్తు సరఫరాను నిలిపేస్తామని, కీలక ఖనిజాల ఎగుమతిని ఆపేస్తామని ఆంటారియో ప్రభుత్వాధినేత డగ్ ఫోర్డ్ హెచ్చరించిన నేపథ్యంలో ట్రంప్ పోస్టు ప్రాధాన్యం సంతరించుకుంది. మరో పోస్టులో కెనడా ప్రధాని మార్క్ కార్నీ, డగ్ ఫోర్డ్‌లపై ట్రంప్ విరుచుకుపడ్డారు. "డగ్ ఫోర్డ్ గొప్పలకు పోతున్నారు. దశాబ్దాలుగా కెనడాకు అమెరికా అండగా నిలిచింది. కానీ ఇకపై అలా జరగదు. మేం లేకపోతే కెనడా మనుగడ సాగించలేదు. ఆ దేశంతో పోలిస్తే అమెరికా సంపన్నమైన, శక్తిమంతమైన దేశం. ఆ దేశానికి అవసరమయ్యే విద్యుత్, చమురు, గ్యాస్‌లో ఎక్కువ భాగం అమెరికా మీదుగానే రవాణా అవుతాయి. కెనడాలో నిరుద్యోగిత రేటు వేగంగా పెరుగుతోంది. వారి వ్యాపారాలు మా దేశానికి తరలివస్తున్నాయి. ఇదంతా మార్క్ కార్నీ, డగ్ ఫోర్డ్ విఫల విధానాలు, అసమర్థ నాయకత్వం వల్లే జరుగుతోంది" అని పేర్కొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## విశాఖ మేయర్ సీటు మీద గంటా ఫ్యామిలీ ఫోకస్?

విశాఖ మేయర్ అంటే ఏపీలోనే అతి పెద్ద స్థానం. ఒక విధంగా చెప్పాలీ అంటే మంత్రి స్థాయి హోదా దీనికి ఉంటుంది. ఇప్పటికే ఏడాదికి అయిదారు వేల కోట్ల బడ్జెట్ జీవీఎంసీది. మరో అయిదేళ్ళ కాలం అంటే పది వేల కోట్ల దాకా పెరిగే చాన్స్ ఉంది. ఎందుకంటే జీవీఎంసీ చుట్టూ ఎన్నో పరిశ్రమలు వస్తున్నాయి. అలాగే ఐటీ పరిశ్రమలతో పాటు గూగుల్ డేటా సెంటర్ వస్తోంది మరో అయిదారు డేటా సెంటర్లు కూడా వస్తున్నాయి. దాంతో ఇంత భారీ బడ్జెట్ తో ఉన్న జీవీఎంసీ మేయర్ పోస్టు అంటే ఎంతో కీలకమైనదిగా అంతా భావిస్తున్నారు. అంతే కాదు ఏపీలోనే 120 వార్డులతో జీవీఎంసీ అతి పెద్ద కార్పొరేషన్ గా ఏర్పడనుంది. దాంతో విశాఖ మేయర్ మీద అందరి కన్ను ఉంది. ఇపుడు చూతే తమాషాకు అన్నారో లేదా కావాలని అన్నారో తెలియదు కానీ మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు తాను విశాఖ మేయర్ గా పోటీ చేయవద్దా అని సంచలన వ్యాఖ్యలే చేశారు.


**రవితేజా రెడీనా :** అసలు గంటా ఈ మాట ఎందుకు అనాల్సి వచ్చిందంటే ఆయన జీవీఎంసీ ఎన్నికల విషయంలో మాట్లాడేందుకు ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విశాఖ మేయర్ పదవికి గంటా రవిజేతా పేరుని మీడియా పేర్కొంటూ పోటీ చేసే అవకాశాలు ఎంతవరకూ ఉన్నాయని గంటానే ప్రశ్నించింది. అయితె దానికి అవును అని కానీ కాదు అని కానీ సూటిగా గంటా చెప్పకుండా రవితేజా ఎందుకు నేను పోటీ చేయవద్దా అని మీడియాకే తిరిగి ప్రశ్నించారు. అంతే కాదు ఆయన మరిన్ని వ్యాఖ్యలు చేశారు. ముందు రిజర్వేషన్ల సంగతి తేలాలని, అలాగే కూటమి పార్టీలు అన్నీ కలసి చర్చించుకోవాలని అపుడు కదా ఎవరు పోటీ అన్నది తేలేది అన్నారు. అందువల్ల ఇపుడే ఏది చెప్పినా తొందరపాటే అవుతుంది అని ఆయన అన్నారు.

**గంటా ఫ్యామిలీ నుంచేనా :** అయితే గంటా తమాషాగా తాను మేయర్ అభ్యర్థిగా పోటీ చేయవద్దా అని అంటున్నా ఆయన మనసులో మేయర్ పీఠం మీద ఫోకస్ ఉందని ప్రచారం సాగుతోంది. రాష్ట్రంలో చాలా చోట్ల ఎమ్మెల్యేల వారసులు, మంత్రుల వారసులు మేయర్ జెడ్పీ ఛైర్మన్ల వంటి వాటికి పోటీకి దిగుతున్నారు. ఆ విధంగా తమ బిడ్డల రాజకీయ ఎంట్రీకి సరైన పునాది వేయాలనుకుంటున్నారు. అంతవరకూ ఎందుకు నర్సీపట్నం మున్సిపాలిటీ ఛైర్మన్ పదవికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు రెండవ కుమారుడు పేరు వినిపిస్తోంది. మరో మూడేళ్ల దాకా సార్వత్రిక ఎన్నికలు జరగవు. ఈ లోగా కీలక పదవిలో వారసులు కుదురుకుంటే ఆ సమయంలో ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించినా వారికి మెండుగా అవకాశాలు ఉంటాయని ఈలోగా రాజకీయంగా పాలనాపరంగా అనుభవం సంపాదించుకోవడమే కాకుండా తండ్రుల ప్రమేయం లేకుండా వారసులే అధినాయకత్వానికి మరింత సన్నిహితం కావచ్చు అన్న ఆలోచనలు కూడా ఉన్నాయని అంటున్నారు.

**బలమైన సామాజిక వర్గం :** ఇదిలా ఉంటే విశాఖ మేయర్ సీటు ఓసీ అయితే మాత్రం గంటా ఫ్యామిలీ నుంచి అభ్యర్ధి ఉండడం ఖాయమని అంటున్నారు. ఎందుకంటే జీవీఎంసీ పరిధిలో కాపులు అధికంగా ఉన్నారు. బలమైన సామాజిక వర్గాన్ని ఆకట్టుకునేందుకు కచ్చితంగా ఈ సీటు వారికే కేటాయించేందుకు కూటమి చూస్తుందని అంటున్నారు. కార్పోరేషన్ గా విశాఖ 1979లో అవతరించింది. ఇప్పటిదాకా కాపుల నుంచి మేయర్ అయిన వారు లేరని గుర్తు చేస్తున్నారు. తొలి ఎన్నికల్లో బీజేపీ గెలిచింది. రెడ్డి సామాజిక వర్గం వారు మేయర్ అయ్యారు. ఆ తర్వాత ఎన్నికల్లో టీడీపీ గెలిస్తే బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన డీవీ సుబ్బారావుకి అవకాశం ఇచ్చారు. 1995లో కాంగ్రెస్ నుంచి వెలమ సామాజిక వర్గానికి చెందిన సబ్బం హరి మేయర్ అయ్యారు.

**ఎప్పటి నుంచో డిమాండ్ “**

2000లో యాదవ సామాజిక వర్గానికి చెందిన రాజాన రమణి కాంగ్రెస్ నుంచి మేయర్ అయ్యారు, 2007లో మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన పులుసు జనార్ధనరావు కాంగ్రెస్ తరపున మేయర్ అయ్యారు. 2021లో యాదవ సామాజిక వర్గానికి చెందిన హరి వెంకట కుమారి మేయర్ వైసీపీ నుంచి అయ్యారు. ఇక చివరి ఏడాది టీడీపీ నుంచి గవర సామాజిక వర్గానికి చెందిన పీలా శ్రీనివాసరావు మేయర్ అయ్యారు. దాంతో ఈసారి మేయర్ పదవి తమకు ఇవ్వాలని కాపులు కోరుతున్నారు. కాపులకు కేటాయిస్తే విశాఖ జిల్లా మీద గట్టి పట్టు ఉన్న గంటా శ్రీనివాసరావు తన కుమారుడిని మేయర్ అభ్యర్థిగా ముందు పెట్టి కచ్చితంగా గెలిపించుకునే అవకాశాలు ఉన్నాయని ప్రచారం అయితే సాగుతోంది. మరి చూడాలి ఏమి జరుగుతుందో.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## శ్రీశైలంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్య



**శ్రీశైలం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీశైలంలోని వడ్డెర సత్రంలోని రూమ్ నెం.11లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో ఇద్దరు గదిలోని హాలులో ఫ్యాన్‌కు ఉరేసుకోగా, స్నానాల గదిలో ముగ్గురు మహిళలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. 3 రోజుల క్రితమే జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సత్రంలోని గది నుంచి దుర్వాసన వస్తుండటంతో నిర్వాహకులు వెళ్లి చూడగా మృతదేహాలు కనిపించాయి. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజనేయులు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. ఘటనపై శ్రీశైలం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాదాపు నెల రోజుల నుంచి వీరంతా వడ్డెరసత్రంలో బస చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. మృతులు శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లికి చెందిన పల్లపు సుధాకర్(36), మల్లేశ్వరి(45), శ్రీదేవి(33), గోగుల ఆదిలక్ష్మి(50), మణికంఠ(15)గా గుర్తించారు. ఆర్థిక ఇబ్బందులే వీరి ఆత్మహత్యకు కారణమని అనుమానిస్తున్నారు. “గత నెల 28న సుధాకర్‌తో పాటు ఆయన ముగ్గురు తోబుట్టువులు, మేనల్లుడు శ్రీశైలం వచ్చారు. రోజుకు రూ.800 అద్దె చెల్లిస్తూ వడ్డెర సత్రం గదిలో ఉంటున్నారు. ఇన్ని రోజులు ఉండకూడదన్నా.. ఆరోగ్యం బాగాలేదంటూ కొనసాగారు. బత్తలపల్లికి చెందిన సుధాకర్, ఆయన చెల్లెళ్లు, మేనల్లుడు ఉరేసుకున్నారు. సుధాకర్‌కు ఇంకా వివాహం కాలేదు. ఇద్దరు చెల్లెళ్లకు పెళ్లి చేసినా భర్తలను వదిలేసి ఇంటి వద్దే ఉంటున్నారు. వీరికి ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నట్టు తెలుసుకున్నాం. ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆత్మహత్యకు పాల్పడ్డారు. బత్తలపల్లిలోని వారి బంధువులకు సమాచారం ఇచ్చాం. ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం” అని డీఎస్పీ తెలిపారు. శ్రీశైలంలో ఐదుగురు ఆత్మహత్య ఘటనపై ఆలయ ఛైర్మన్ రమేష్ నాయుడు, ఈవో శ్రీనివాసరావు స్పందించారు. ఐదుగురు ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమన్నారు. వసతి గదుల్లో భక్తుల బసకు 48 గంటలే అనుమతి ఉందన్నారు. కానీ, సత్రం నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించి గదులు కేటాయించారన్నారు. ప్రైవేటు సత్రాలన్నీ నిబంధనల ప్రకారం గదులు కేటాయించాలని ఆదేశించారు. మరో వైపు వడ్డెర సత్రం నిర్వహణ వివాదాస్పదంగా మారింది. సత్రాన్ని గతంలో దేవస్థానం అధికారులు సీజ్ చేయగా.. హైకోర్టు ఉత్తర్వులతో యాజమాన్యం మళ్లీ నిర్వహణ చేపట్టింది. సత్రం వరుస వివాదాలపై విచారణ చేస్తున్నట్టు ఆలయ ఛైర్మన్, ఈవో వెల్లడించారు.

## పన్ను తగ్గించడానికి లంచం

### రూ.50 వేలు తీసుకుంటూ అనిశాకు చిక్కిన అధికారులు



**నిర్మల్ పట్టణం, విశ్వం వాయిస్ న్యూస్ :** నిర్మల్ వాణిజ్య పన్నుల శాఖ సర్కిల్ కార్యాలయంలో స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్ కొప్పెల గోదావరి, సీనియర్ అసిస్టెంట్ మంత్రి సాయికృష్ణ ఏసీబీకి చిక్కారు. ఆదిలాబాద్ డీఎస్పీ జి.మధు కథనం ప్రకారం.. వ్యాపారానికి సంబంధించి 2022-23, 2023-24 ఆడిట్ రికార్డుల విషయంలో పన్ను తగ్గేలా శాఖాపరమైన ప్రయోజనం చేకూరుస్తామని.. మంచిర్యాలకు చెందిన ఓ వ్యాపారి నుంచి గోదావరి, సాయికృష్ణ రూ.లక్ష డిమాండ్ చేశారు. చివరకు రూ.50 వేలకు బేరం కుదిరింది. ఆ డబ్బులూ ఇవ్వడం ఇష్టం లేక సంబంధిత వ్యాపారి ఏసీబీని ఆశ్రయించారు. వారి సూచనల మేరకు రూ.50 వేల నగదును సోమవారం నిర్మల్‌లోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో గోదావరికి అందజేశారు. ఆమె డబ్బులను సాయికృష్ణకు ఇచ్చారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న అనిశా అధికారులు వారిని పట్టుకుని కేసు నమోదు చేశారు. నిందితులను కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు.

## హైదరాబాద్‌లో 12 మంది నకిలీ వైద్యుల అరెస్ట్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నకిలీ ధ్రువపత్రాలతో వైద్యులుగా చలామణి అవుతోన్న 12 మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ జోన్లలో ప్రత్యేక ఆపరేషన్ పేరిట పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అర్హత లేకున్నా క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు సెలైన్లు, ఇంజక్షన్లు, మందులు ఇస్తున్నట్లు గుర్తించినట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ తెలిపారు. పారామెడికల్ కోర్సు చేసిన ఓ మహిళ అనుమతులు లేకుండా నాలుగేళ్లుగా క్లినిక్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. పట్టుబడిన 12 మంది నకిలీ వైద్యులను అదుపులోకి తీసుకుని పెద్ద ఎత్తున సెలైన్ బాటిళ్లు, బీపీ పరికరాలు, సర్జికల్ కత్తెరలు మందులను స్వాధీనం చేసుకున్నారు.

### మత్తు ఇంజక్షన్‌తో నాడు తల్లిదండ్రుల హత్య...

## మానసిక క్షోభతో నేడు ఆత్మహత్య

### బెయిల్‌పై బయటికొచ్చిన నర్సు బలవన్మరణం



**సంగారెడ్డి అర్బన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రేమ వివాహానికి అంగీకరించలేదనే కోపంతో తల్లిదండ్రులకు మత్తు ఇంజక్షన్ ఇచ్చి హత్య చేసిన యువతి... జైలు నుంచి బెయిల్‌పై బయటికొచ్చి అదే మత్తు ఇంజక్షన్‌తో బలవన్మరణానికి పాల్పడింది. సంగారెడ్డిలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పట్టణ సీఐ రామునాయుడు తెలిపిన ప్రకారం... వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం యాచారానికి చెందిన నక్కలి దశరథం(58), లక్ష్మి(54) దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు సంతానం. మూడో కుమార్తె సురేఖ(25)కు మినహా అందరికీ వివాహాలయ్యాయి. సురేఖ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేసేది. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలానికి చెందిన ఓ యువకుడి(డ్రైవర్)ని ఆమె ప్రేమించింది. అతడితో వివాహానికి తల్లితండ్రులు నిరాకరించారన్న అక్కసుతో... ఈ ఏడాది జనవరి 28న వారికి మత్తు ఇంజక్షన్ ఇచ్చి హత్య చేసింది. సహజ మరణమని నమ్మించేందుకు తొలుత ప్రయత్నించినా.. తర్వాత నేరం అంగీకరించడంతో పోలీసులు ఆమెను అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు పంపారు. జులై 31న బెయిల్‌పై బయటకు రాగా.. సోదరుడు సురేఖను సంగారెడ్డిలోని ఓ వసతిగృహంలో చేర్పించారు. తల్లిదండ్రులను హత్య చేశానన్న పశ్చాత్తాపం, ప్రియుడు దూరమవడం, బంధువులెవరూ ఆమెతో మాట్లాడకపోవడంతో మానసిక క్షోభకు గురైంది. వసతిగృహంలోనే ఆదివారం రాత్రి మత్తు ఇంజక్షన్ తీసుకొని ఆత్మహత్య చేసుకుంది.

**అన్నా.. రాఖీ కట్టలేకపోతున్నా...**

‘నాకు చాలాకాలం బతకాలని, జీవితాన్ని ఎంజాయ్ చేయాలని ఉండేది. కానీ, దేవుడు ఆ రాత రాయలేదు. ఇప్పుడు బతకాలనే ఆశ లేదు. నా చావుకు ఎవరూ కారణం కాదు. అన్నా... రాఖీ కట్టలేకపోతున్నా. నన్ను క్షమించు’ అంటూ సురేఖ ఆంగ్లంలో రాసిన లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



# విశ్వం వాయిస్

అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు




బుధవారం, 26 ఆగస్టు, 2026

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమూజ బాధ్యత — www.viswamvoice.com







**రాజమండ్రి/మండపేట, ఆగస్టు 25,విశ్వం వాయిస్ న్యూస్ :** "రాష్ట్రంలో ఎక్కడా బెల్ట్ షాపు కనిపించడానికి వీల్లేదు.. కనిపిస్తే బెల్ట్ తీస్తాం" అని సీఎం చంద్రబాబు నాయుడు, ఆడబిడ్డలకు అండగా ఉంటామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన హెచ్చరికలు మండపేట నియోజకవర్గంలో బూడిదలో పోసిన పన్నీరవుతున్నాయి. క్షేత్రస్థాయిలో మద్యం మాఫియా రెచ్చిపోతుంటే.. అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో జోగుతోంది. మండపేట నియోజకవర్గవ్యాప్తంగా గల్లీ కొట్టు నుంచి ప్రధాన కూడళ్ల వరకు రాత్రింబవళ్లు తేడా లేకుండా 24 గంటలూ మద్యం ఏరులై పారుతోంది. గ్లాసుల్లో పోసి విక్రయిస్తూ పల్లెలను తాగుబోతుల అడ్డాలుగా మార్చేస్తున్నా అటు ఎక్సైజ్, ఇటు పోలీస్ శాఖలు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ మాఫియాకు కొమ్ముకాస్తున్నాయన్న తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**గడప దాటాలంటే భయం.. వల్లూరులో నరకయాతన**

నియోజకవర్గంలోని వల్లూరు గ్రామంలో పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. నివాస గృహాల నడుమ, ప్రధాన వీధుల్లోనే దర్జాగా బెల్ట్ షాపులు నడుపుతున్నారు. ఉదయాన్నే పురుషులు పొలం పనులకు వెళ్లాక ఒంటరిగా ఉండే మహిళలు బయటకు వచ్చి వాకిలి ఊడ్చుకోవాలన్నా, పాడి పశువులకు నీళు పెట్టుకోవాలన్నా ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. పాఠశాలలకు వెళ్లే చిన్నారి విద్యార్థినులు, ఆలయాలకు వెళ్లే మహిళల పట్ల మందుబాబులు అసభ్యంగా ప్రవర్తిస్తూ రోడ్లపైనే వీరంగం సృష్టిస్తున్నారు. మద్యం మత్తులో మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ పిల్లల పైకి దూకిస్తున్నారు. రాత్రి వేళల్లో ఇళ్ల గుమ్మాల వద్దకు వచ్చి తలుపులు బాదుతూ అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో ఆడబిడ్డలు నిత్యం భయంతో వణికిపోతున్నారు.

**ప్రజాప్రతినిధుల ఉదాసీనత.. రోడ్డెక్కిన మహిళా లోకం**

ఈ అన్యాయంపై స్థానిక గ్రామ పంచాయతీతో పాటు మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ప్రజాప్రతినిధులు 'చూద్దాం.. చేద్దాం' అంటూ కాలయాపన చేయడమే తప్ప సమస్యను పట్టించుకోకపోవడంతో మద్యం మాఫియా మరింత బరితెగించింది. అధికారుల నిర్లక్ష్యం, నేతల నిమ్మకు నీరెత్తిన వైఖరితో విసిగివేసారిన వల్లూరు మహిళలు సుమారు 50 కిలోమీటర్లు ప్రయాణించి జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని అక్రమ బెల్ట్ షాపులను శాశ్వతంగా మూసివేయించి, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

జగ్గంపేట తహశీల్దార్ కార్యాలయంలో

## జేసీ ఆకస్మిక తనిఖీ



**జగ్గంపేట, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్:** కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మంగళవారం జగ్గంపేట మండల తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన రికార్డు గది, సిబ్బంది హాజరు పట్టికలను తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. ప్రధానంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కార పురోగతిపై జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీల వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని, వాటిని సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రజా సేవల పట్టికలో నమోదైన వివరాల ఆధారంగా భూముల పునఃసర్వే, పట్టాదారు పాస్ పుస్తకాలు, 22ఏ జాబితా, భూముల మార్పిడి తదితర అంశాలకు సంబంధించి అందిన దరఖాస్తులపై తీసుకున్న చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ ప్రజలకు రెవెన్యూ సేవలు సకాలంలో అందేలా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సుపరిపాలన ప్రజలకు చేరువ కావడంలో రెవెన్యూ అధికారులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, 22ఏ జాబితా, భూముల పునఃసర్వేకు సంబంధించిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ అంశాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, భూ పరిపాలన ముఖ్య కమిషనర్ తదితర ఉన్నతాధికారులు ప్రతివారం సమీక్ష నిర్వహిస్తున్నందున, అధికారులు ఆశించిన స్థాయిలో పురోగతి సాధించాలని సూచించారు. అనంతరం కార్యాలయ పరిసరాలను, రికార్డు గదులను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా కార్యాలయ అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీలో తహశీల్దార్ జేవీఆర్ రమేష్, ఉప తహశీల్దార్, పునఃసర్వే తహశీల్దార్లు, అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అరగంట వర్షానికే

## అన్నమ్మ చెరువు పార్క్ జలమయం

**వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు -వాకర్స్ ఆవేదన**





**కాకినాడ, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్:** కాకినాడలోని అన్నమ్మ చెరువు పార్క్‌లో సోమవారం సాయంత్రం కురిసిన స్వల్ప వర్షానికే వాకింగ్ ట్రాక్ జలమయమైంది. సాయంత్రం 4.30 గంటల నుంచి 5 గంటల మధ్య కురిసిన వర్షానికి పార్క్‌లోని సుమారు 15 ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో వాకింగ్‌కు వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాకింగ్ ట్రాక్ అభివృద్ధి కోసం రూ.9.50 లక్షలతో శ్రీ వినాయక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు పనులు అప్పగించి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడంపై వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్క్‌లో సరైన నీటి పారుదల వ్యవస్థ లేకపోవడంతో కొద్దిపాటి వర్షానికే ట్రాక్‌పై భారీగా నీరు నిలిచిపోతోందని తెలిపారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో నడిచేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ముఖ్యంగా వృద్ధులు జారిపడి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని వాకర్ డి. భద్రం తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పనులను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించాలని, నీటి పారుదల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. అన్నమ్మ చెరువు పార్క్‌ను ప్రతిరోజూ వందలాది మంది వాకింగ్, వ్యాయామం కోసం వినియోగిస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని వాకర్స్ విజ్ఞప్తి చేస్తున్నారు.

## నీట్ పీజీ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

**కాకినాడ జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాలు.. పకడ్బందీగా నిర్వహణకు అధికారులకు కలెక్టర్ ఆదేశాలు**





**కాకినాడ, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్:** జాతీయ స్థాయిలో ఈ నెల 30న నిర్వహించనున్న నీట్ పీజీ పరీక్షను కాకినాడ జిల్లాలో ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. నీట్ పీజీ పరీక్ష నిర్వహణపై మంగళవారం న్యూఢిల్లీ నుంచి నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి. తిప్పే నాయక్‌తో పాటు ఇతర అధికారులు కాకినాడ కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. సమావేశం అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 30న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యం, భద్రతా ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు, రవాణా నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

## సాధిక్ ఖాన్‌ను కఠినంగా శిక్షించాలి

**ముస్లిం జేఏసీ కన్వీనర్ ఎండీ అస్గర్ డిమాండ్**



**కాకినాడ, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్:** పంచాయతీ రాజ్ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్యకు కారణమైన నిందితుడు సాధిక్ ఖాన్‌ను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ముస్లిం జేఏసీ కన్వీనర్ ఎండీ అస్గర్ డిమాండ్ చేశారు. బాధితుడైన ఏఈ కుటుంబానికి వారు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మంగళవారం కాకినాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. సాధిక్ ఖాన్ చేసిన నేరపూరిత చర్యను యావత్ ముస్లిం సమాజం తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు. సమాజంలో ఇటువంటి నేరాలకు పాల్పడే వ్యక్తులను స్వేచ్ఛగా తిరగనివ్వకూడదని, నిందితుడిపై ప్రభుత్వం, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై బాధితులకు పూర్తి న్యాయం చేయాలని ఇప్పటికే జిల్లా ఎస్పీకి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమేనని, నేరం చేసిన వ్యక్తి ఏ మతానికి చెందినవాడైనా శిక్ష అనుభవించాల్సిందేనని స్పష్టం చేశారు.ఒక వ్యక్తి చేసిన దుర్మార్గాన్ని సాకుగా చూపి మొత్తం ముస్లిం సమాజాన్ని నిందించడం, ఉగ్రవాదులుగా లేదా దేశద్రోహులుగా చిత్రీకరించే ప్రయత్నాలు చేయడం గర్హనీయమని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసమో, వర్గాల మధ్య విభేదాలు సృష్టించడానికో ఇలాంటి సున్నితమైన అంశాలను అడ్డుపెట్టుకుని మత విద్వేషాలు రెచ్చగొట్టవద్దని విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా కాకినాడలో హిందూ-ముస్లింలు ఎంతో ఐకమత్యంతో, సోదరభావంతో జీవిస్తున్నారని గుర్తుచేస్తూ.. శాంతి సామరస్యాలను కాపాడాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు యంత్రాంగం నిష్పాక్షికంగా వ్యవహరించి, తప్పుడు ప్రచారాలకు అడ్డుకట్ట వేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# గోదావరి పుష్కర ఘాట్ల నిర్వహణ పనులు వేగవంతం చేయాలి

**అమలాపురం, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి పుష్కరాల సన్నద్ధతలో భాగంగా పుష్కర ఘాట్ల నిర్వహణ పనులను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వై.ఖోమ్ నైడియా దేవి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి ముఖ్యమంత్రి జూమ్ సమావేశం ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో గోదావరి పుష్కర ఘాట్ల అభివృద్ధి, ఆధ్యాత్మిక దేవాలయాల నిర్వహణ, పర్యాటకం, మౌలిక వసతుల కల్పనపై సమీక్ష నిర్వహించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా అఖండ గోదావరి పరివాహక ప్రాంతాల్లోని వాడపల్లి, అంతర్వేది, కోటిపల్లి, అప్పనపల్లి, కుండలేశ్వరం ప్రాంతాల్లో ఆధ్యాత్మికత, దైవభక్తి, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ గోదావరి విశిష్టతను మరింత పెంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నైడియా దేవి




పుష్కర ఘాట్ల నిర్వహణ పనులపై ప్రత్యేక దృష్టి సారించి, వివిధ శాఖల సమన్వయంతో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పోలీస్, దేవాదాయ, పర్యాటక, ఇరిగేషన్, పంచాయతీ శాఖల అధికారులు సమన్వయంతో నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించి గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. పుష్కరాల సమయంలో భక్తుల రద్దీని నియంత్రించేందుకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని, బస్సుల రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

భక్తుల తాకిడి అధికంగా ఉండే అవకాశం ఉన్నందున తాత్కాలిక వసతి సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, రెవెన్యూ, దేవాదాయ, ఇరిగేషన్, పంచాయతీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసిన

# యువజన విభాగ నాయకుడు పిల్లి సూర్య ప్రకాష్



**రామచంద్రపురం, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రామచంద్రపురం నియోజకవర్గ సమన్వయకర్త పిల్లి సూర్యప్రకాష్ తో కలిసి రామచంద్రపురం నియోజకవర్గ యువజన విభాగ నాయకుడు, తాళ్ల పొలం గ్రామ మాజీ ఉప సర్పంచ్ వల్లు శివనాగరాజు కలిశారు. ఎన్నో రోజుల నుంచి పార్టీ అధ్యక్షులు జగన్ ను కలవాలన్న కోరిక నెరవేరిందని వల్లు శివనాగరాజు సంతోషం వ్యక్తం చేశారు. జగన్ తనతో చాలా ఆప్యాయంగా మాట్లాడారని, ఈ కలయిక పార్టీ అభివృద్ధిలో మరింత బాధ్యతగా పనిచేసేలా స్ఫూర్తిని ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా జగన్ ను కలిసే అవకాశం కల్పించిన పిల్లి సూర్యప్రకాష్ కు శివనాగరాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల

# ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం



**రామచంద్రపురం, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖాళీగా ఉన్న సబ్జెక్టులకు తాత్కాలిక అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కే. చిట్టిబాబు తెలిపారు. బోటనీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ అప్లికేషన్, తెలుగు, ఎకనామిక్స్ సబ్జెక్టులలో ఒక్కొక్క అధ్యాపకుని నియామకానికి ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు తమ ధ్రువపత్రాలతో ఈ నెల 29వ తేదీ లోపల ప్రిన్సిపాల్ కార్యాలయ పనివేళల్లో దరఖాస్తులను సమర్పించాలని వెల్లడించారు.

# మహిళా, శిశు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

**11 మంది అంగన్వాడీ హెల్పర్లకు నియామక పత్రాలు అందజేసిన మంత్రి వాసంశెట్టి సుభాష్**
**అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్లకు యూనిఫామ్‌ల పంపిణీ**



**రామచంద్రపురం, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్ :** అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు మెరుగైన పౌష్టికాహారం అందించడంతో పాటు నాణ్యమైన విద్య, ఆరోగ్య పరిరక్షణ సేవలు అందించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. రామచంద్రపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 11 అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు కొత్తగా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం తన చేతుల మీదుగా అందజేశారు. ఇందులో రామచంద్రపురం మండలానికి చెందిన 3 మంది, కె.గంగవరం మండలానికి చెందిన 8 మంది ఉన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వ్యవస్థలో పనిచేస్తున్న సిబ్బందిని ప్రోత్సహించే చర్యల్లో భాగంగా 183 మంది అంగన్వాడీ వర్కర్స్, 179 మంది అంగన్వాడీ హెల్పర్స్‌కు యూనిఫామ్‌లను మంత్రి సుభాష్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల భవిష్యత్తుకు పునాది వేస్తున్న కీలక కేంద్రాలని అన్నారు. చిన్నారులకు ప్రతిరోజూ అందించే పౌష్టికాహారం నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి ఆరోగ్యం, పరిశుభ్రత, విద్యా ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే ప్రతి చిన్నారికి ఆప్యాయతతో కూడిన వాతావరణం కల్పించి, ఆటపాటలతో కూడిన విద్య ద్వారా వారి మేధో వికాసానికి తోడ్పడాలని తెలిపారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు, పారిశుధ్యం, విద్యా వాతావరణం మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. అంగన్వాడీ సిబ్బంది తమ బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించి ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ వి.వి.వరహాలక్ష్మి, సూపర్ వైజర్స్ కె నాగమణి, కళ్యాణి, పార్వతి, అలాగే అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు దుర్గాదేవి, వర్కర్స్, హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

### అమలాపురంలో నూతన సబ్ డివిజనల్

# పోలీస్ కార్యాలయం ప్రారంభం



**అమలాపురం, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నూత నంగా ఏర్పాటు చేసిన సబ్ డివి జనల్ పోలీస్ కార్యాలయాన్ని మంగళవారం ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి. అశోక్‌కుమార్, ఐపీఎస్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ ప్రారంభిం చారు. ముందుగా ఐజీకి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. నూతన సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయం అందుబాటులోకి రావడంతో అమలాపురం సబ్ డివిజన్ పరిధిలో పోలీసు పరిపాలన, శాంతిభద్రతల పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఏర్పడిందని ఐజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయెల్, పేరాబత్తుల రాజశేఖరం, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అల్లాడ శరత్‌బాబు, పెచ్చెట్టి చంద్రమౌళి, ఆర్డీఎస్ ప్రసాద్, కంచిపల్లి అబ్బులు, బోణం సత్యవరప్రసాద్, అదనపు ఎస్పీ మహేంద్ర మత్తే, అమలాపురం ఎస్‌డీపీఓ టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, అమలాపురం టౌన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ పి. వీరబాబు, ఎస్సైలు, పంచాయతీరాజ్ అధికారులు, ఇతర పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

### పార్లమెంటరీ కమిటీ సమావేశంలో

# పాల్గొన్న ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్ :** 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అంశంపై న్యూఢిల్లీలో సోమవారం జరిగిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ సమావేశంలో అమలాపురం పార్లమెంట్ సభ్యుడు గంటి హరీష్ బాలయోగి పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే ప్రతిపాదనపై కమిటీ సభ్యులు విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో ఎన్నికల నిర్వహణ, రాజ్యాంగపరమైన అంశాలు, పరిపాలనా సౌలభ్యం, ఎన్నికల వ్యయాన్ని తగ్గించే అవకాశాలు తదితర అంశాలపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' విధానం అమలులో ఎదురయ్యే సాధ్యాసాధ్యాలు, దీనివల్ల కలిగే ప్రయోజనాలు, అవసరమైన రాజ్యాంగపరమైన మార్పులు వంటి అంశాలపై కూడా చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. సమావేశంలో రాజ్యసభ సభ్యులు, మాజీ కేంద్ర మంత్రి పి. చిదంబరంతో పాటు ఇతర సంబంధిత వర్గాల ప్రతినిధులు, నిపుణులు పాల్గొని తమ అభిప్రాయాలను కమిటీకి వివరించారు. ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు, ఏకకాల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై నిపుణుల నుంచి కమిటీ సభ్యులు వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ హరీష్ బాలయోగి కూడా సమావేశంలో చురుకుగా పాల్గొని 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' ప్రతిపాదనకు సంబంధించిన అంశాలపై జరిగిన చర్చల్లో తన అభిప్రాయాలను వెల్లడించారు. దేశంలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జరిగిన చర్చల్లో ఆయన పాల్గొన్నారు. దేశంలో తరచూ జరిగే ఎన్నికల కారణంగా ప్రభుత్వ యంత్రాంగంపై పడుతున్న అదనపు భారం, ఎన్నికల నిర్వహణకు అయ్యే వ్యయం, అభివృద్ధి కార్యక్రమాలపై ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రభావం వంటి అంశాలు కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చినట్లు సమాచారం. అదే సమయంలో రాష్ట్రాల హక్కులు, సమాఖ్య వ్యవస్థ, రాజ్యాంగపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరంపై కూడా సభ్యులు దృష్టి సారించారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అంశంపై అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సమగ్రంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలనే ఉద్దేశంతో సంయుక్త పార్లమెంటరీ కమిటీ వివిధ వర్గాలతో సంప్రదింపులు జరుపుతోంది. ఈ క్రమంలో న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో ఎంపీ హరీష్ బాలయోగి పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# రామచంద్రపురం పశుసంవర్ధక శాఖ సమీక్షా సమావేశం



**రామచంద్రపురం, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం ఉప విభాగ పరిధిలోని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఓ. రామకృష్ణ ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అమలాపురం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ ఎల్. అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖలో అత్యంత కీలకమైన 'శాస్కి' కార్యక్రమం గురించి విపులంగా చర్చించారు. ఈ ఏడాది పూర్తి చేయవలసిన లక్ష్యాలు, ఇప్పటి వరకు సాధించిన ప్రగతి విధివిధానాలను సమావేశంలో వివరించారు. ఇప్పటి వరకు 74 శాతం లక్ష్యాన్ని చేరుకున్నట్లు వెల్లడించారు. అలాగే పాడి పశువుల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడేలా, కేవలం ఆడ దూడలే పుట్టే వీర్యాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు డాక్టర్ ఎల్. అనిత తెలిపారు. పశువైద్య సిబ్బంది అందరూ రైతులకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కే. గంగవరం, రామచంద్రపురం మండలాలకు చెందిన పశువైద్యాధికారులు, పశుసంవర్ధక సహాయకులు, గోపాల మిత్రులు పాల్గొన్నారు.



# కొత్తూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

**కొత్తూరు, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మండలం కొత్తూరు గ్రామంలో ఈరోజు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామచంద్రపురం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎం. అరుణ ముఖ్య అతిథిగా హాజరై, స్థానిక మండల వ్యవసాయాధికారి టి.వి.ఆర్. మణిదీప్, ఇతర వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం మండలంలో వరి పొలాలు చాలా ఆశాజనకంగా, ఆరోగ్యకరమైన ఎదుగుదలతో ఉన్నాయని సహాయ సంచాలకులు తెలియజేశారు. వరి పంటలో కలుపు నివారణకు తీసుకోవాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే వరిని ఆశించే వివిధ రకాల పురుగులు, తెగుళ్లు, వాటిని సకాలంలో నివారించడానికి వాడాల్సిన మందుల వివరాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొని సలహాలు, సూచనలు స్వీకరించారు.





# అఖండ గోదావరి పుష్కరాలకు పటిష్ట ప్రణాళిక

## శాఖల సమన్వయంతో భక్తులకు అన్ని మౌలిక వసతులు : జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**కాకినాడ, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్:** అఖండ గోదావరి పుష్కరాలు–2027ను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టి, పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుష్కరాల ప్రత్యేక అధికారి జి. వీరపాండ్యన్ అమరావతి నుంచి అఖండ గోదావరి పరివాహక ప్రాంతానికి చెందిన ఆరు జిల్లాల కలెక్టర్లతో దృశ్య శ్రవణ సమావేశం నిర్వహించారు. పుష్కరాల ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన మౌలిక వసతులు, పర్యాటక అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, గోదావరి నది పవిత్రత, సాంస్కృతిక ప్రాధాన్యత తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా పరిధిలోని గోదావరి నదీ తీర ప్రాంతాల్లో ఐదు ప్రధాన ఘాట్లను అన్ని వసతులతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. గోదావరి కాలువల వెంబడి తొమ్మిది మండలాల్లో 82 ఘాట్లను గుర్తించినట్లు వెల్లడించారు. ప్రధాన ఘాట్లతో పాటు గుర్తించిన ఘాట్ల వద్ద భక్తుల రాకపోకలు, భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు, మరుగుదొడ్లు, వాహనాల నిలుపుదల ప్రాంతాలు, రహదారి సౌకర్యాలపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఘాట్లకు చేరుకునే రహదారులను ముందుగానే పరిశీలించి అవసరమైన మరమ్మతులు, విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఘాట్ల వద్ద కంచెల ఏర్పాటు, రక్షణ చర్యలు, అవసరమైన చోట్ల చేరుకునే మార్గాలు, వాహనాల నిలుపుదల ప్రాంతాలను పటిష్టంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్ల నుంచి భక్తులు సులభంగా ఘాట్లకు చేరుకునేలా రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు దిశా నిర్దేశక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రాజమండ్రి--కాకినాడ కాలువ రహదారి తదితర మార్గాలను పుష్కరాల సమయంలో పెరిగే రద్దీకి అనుగుణంగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

**భక్తుల రద్దీ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక**

పుష్కర ఘాట్లకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రద్దీ నియంత్రణ, వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణ, వాహనాల నిలుపుదల, అత్యవసర పరిస్థితుల నిర్వహణకు పోలీసు శాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర సేవలకు ప్రత్యేక మార్గాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, అవసరమైన ప్రాంతాల్లో సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

**ఆధ్యాత్మికతతో పాటు పర్యాటక అభివృద్ధి**

అఖండ గోదావరి పుష్కరాలను ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు జిల్లాలోని ప్రముఖ దేవాలయాలు, చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలతో అనుసంధానం చేసి పర్యాటకులను ఆకర్షించేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. గోదావరి స్నానం, పూజలు, దానం, పితృతర్పణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ప్రముఖ దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా సమగ్ర పర్యాటక మార్గాలను రూపొందించాలని సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తుల బస కోసం స్థానికంగా గృహ వసతి సౌకర్యాలను కూడా ప్రోత్సహించాలని తెలిపారు.

**పారిశుద్ధ్యం, వైద్య సేవలకు ప్రాధాన్యం**

పుష్కర ఘాట్ల వద్ద పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి నిరంతరం సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. తాగునీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్లు, చెత్త సేకరణ, వ్యర్థాల తరలింపు వంటి ఏర్పాట్లను పుష్కరాలకు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ఘాట్ల వద్ద ప్రాథమిక వైద్య కేంద్రాలు, అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా వైద్య ఆరోగ్య శాఖ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.

**కాలపరిమితితో పనుల పూర్తి**

అఖండ గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రతి శాఖ తన పరిధిలో చేపట్టాల్సిన పనులను స్పష్టంగా గుర్తించి కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని నిరంతరం సమీక్షించాలని తెలిపారు. పుష్కరాలకు వచ్చే ప్రతి భక్తుడికి సురక్షితమైన, సౌకర్యవంతమైన, ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా ఏర్పాట్లు ఉండాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి. తిప్పే నాయక్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.వి.ఎస్. లక్ష్మణరావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షణ ఇంజనీర్ మహమ్మద్ అబ్దుల్ మతిన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. అనిత, జలవనరుల శాఖ ఇంజనీర్లు, పోలీసు ఉన్నతాధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తీరానికి సహజ రక్షణ కవచంగా తాటి వనాలు

## 5,499 హెక్టార్లలో 55 లక్షల తాటి గింజలు నాటే లక్ష్యం – ఇప్పటికే 13 లక్షల గింజల సేకరణ

**అమరావతి, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ సుదీర్ఘ తీర ప్రాంతానికి సహజ రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసే దిశగా తాటి వనాల అభివృద్ధి కార్యక్రమానికి అటవీ శాఖ శ్రీకారం చుట్టింది. తీర ప్రాంతాల్లో ప్రకృతి విపత్తులు, తుపాను గాలుల ప్రభావాన్ని తగ్గించేందుకు చేపడుతున్న మూడు అంచెల పచ్చదనం ప్రణాళికలో తాటి వనాలకు కీలక స్థానం కల్పించారు. తాటి కాయల సీజన్ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా తాటి గింజల సేకరణ, నాటే కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. తీర ప్రాంతం వెంబడి 5,499 హెక్టార్లలో తాటి వనాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇందుకోసం సుమారు 55 లక్షల తాటి గింజలు అవసరమవుతాయని అటవీ శాఖ అంచనా వేసింది. సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు గ్రామీణ ప్రజలు, వివిధ ప్రభుత్వ శాఖలు, విద్యార్థులు, ఇతర వర్గాల భాగస్వామ్యంతో 13 లక్షల తాటి గింజలను సేకరించారు. ఇప్పటికే 1.65 లక్షల తాటి గింజలను పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలు, పాఠశాల విద్యార్థులు, ప్రజల భాగస్వామ్యంతో అనువైన ప్రాంతాల్లో నాటారు. ఈ సీజన్‌లో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అటవీ శాఖ చర్యలు వేగవంతం చేసింది. తీర ప్రాంతాల్లోని ఉప్పు నేలలు, ఇసుక, బుసకతో కూడిన నేలల్లోనూ తాటి చెట్లు పెరిగే సామర్థ్యం కలిగి ఉంటాయి. ఎత్తుగా పెరిగే తాటి చెట్లు బలమైన సముద్ర గాలులకు సహజ నిరోధక వ్యవస్థగా పనిచేస్తాయి. తాటి చెట్ల బలమైన వేర్లు నేలను గట్టిగా పట్టుకోవడంతో తీర ప్రాంతాల్లో నేల కోతను తగ్గించడంలోనూ దోహదపడతాయి. పక్షులు, కొన్ని రకాల సరీసృపాలకు ఆవాసంగా నిలుస్తూ జీవ వైవిధ్య పరిరక్షణకు కూడా తోడ్పడతాయి. తీర ప్రాంత రక్షణ కోసం చేపడుతున్న మూడు అంచెల పచ్చదనం ప్రణాళికలో మొదటి అంచెలో మడ అడవులకు, రెండో అంచెలో తాటి వనాలకు ప్రాధాన్యత ఇచ్చారు. తాటి వనాలు తుపాను గాలుల వేగాన్ని తగ్గించడంతో పాటు తీర



ప్రాంత గ్రామాలకు రక్షణ కల్పించే సహజ కవచంగా నిలుస్తాయని అటవీ శాఖ అధికారులు పేర్కొన్నారు. తాటి గింజల సేకరణ, నాటడం, మొలకెత్తిన తాటి మొక్కల సంరక్షణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. మొలకెత్తిన మొక్కలను పశువుల నుంచి రక్షించాలని, వాటి సంరక్షణకు స్థానికులు సహకరించాలని కోరారు. తీర ప్రాంతాల్లో అనువైన ప్రదేశాలను గుర్తించి శాస్త్రీయ పద్ధతిలో తాటి గింజలను నాటాలని సూచించారు. స్థానిక ప్రజలు, విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించడం, పర్యావరణ పునరుద్ధరణ, సహజ వనరుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించేందుకు తీర ప్రాంతాల్లో తాటి వనాల పెంపకాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని పిలుపునిచ్చారు.

### మిలాద్ ఉన్ నబి సందర్భంగా

# ముస్లిం సోదర, సోదరీమణులకు జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు



**కాకినాడ, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్:** మిలాద్ ఉన్ నబి పర్వదినాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లా పోలీసు అధికారి జి. బిందుమాధవ్ ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ సంతోషంగా, భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్టమైన బందోబస్తు, రాకపోకల నియంత్రణతో పాటు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మసీదులు, దర్గాలు, ప్రార్థనా స్థలాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రార్థనలు, ఊరేగింపులు, ఇతర పండుగ కార్యక్రమాలను శాంతియుతంగా, క్రమశిక్షణతో నిర్వహించుకోవాలని జిల్లా పోలీసు అధికారి కోరారు. పండుగ సందర్భంగా ప్రజలు పరస్పరం సహకరించుకుంటూ ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించాలని, భద్రతా విధుల్లో ఉన్న పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

### రాజమహేంద్రవరంలో

# 37 అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థానిక అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం**

**రాజమహేంద్రవరం, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్:** రాజమహేంద్రవరంలోని 4వ ఐఆర్ బెటాలియన్ ఏపీఎస్‌పీలో వివిధ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీకి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన స్థానిక అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బెటాలియన్ కమాండెంట్ పి. సత్తిబాబు తెలిపారు. మొత్తం 37 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో రికార్డు అసిస్టెంట్ పోస్టు ఒకటి, ఆఫీస్ సబార్డినేట్ పోస్టు ఒకటి, స్వీపర్ పోస్టులు 9, స్కావెంజర్ పోస్టులు 3, కుక్ పోస్టులు 14, ధోబీ పోస్టులు 5, బార్బర్ పోస్టులు 4 ఉన్నాయి. అభ్యర్థుల విద్యార్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్లు, ఎంపిక విధానం, ఇతర అర్హతలు, నిబంధనలకు సంబంధించిన పూర్తి వివరాలు తూర్పుగోదావరి జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న పూర్తి ప్రకటనలో పరిశీలించాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ ఆగస్టు 27 ఉదయం 10 గంటల నుంచి సెప్టెంబర్ 5 సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. పూర్తిగా నింపిన దరఖాస్తులను కమాండెంట్, 4వ ఐఆర్ బెటాలియన్, ఏపీఎస్‌పీ, ఏ.వి. అప్పారావు రోడ్డు, లాలాచెరువు, రాజమహేంద్రవరం–533106 చిరునామాకు ప్రత్యక్షంగా లేదా పోస్టు ద్వారా సమర్పించాలని తెలిపారు. దరఖాస్తు నమూనా, పూర్తి నోటిఫికేషన్ తదితర వివరాలను eastgodavari.ap.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని కమాండెంట్ పి. సత్తిబాబు అభ్యర్థులకు సూచించారు.

# కులాల వారి పంచాయతీ ఓటర్ల జాబితా విడుదల

**అభ్యంతరాలు ఉంటే ఈ నెల 28 తేదీలోగా తెలియజేయాలి : ఎంపీడీవో పి.వెంకటనారాయణ**



**కోటనందూరు, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్:** కులాల వారీగా పంచాయతీ ఓటర్ల జాబితా విడుదల చేసినట్లు ఎంపీడీవో పి వెంకట నారాయణ తెలియజేశారు. కాకినాడ జిల్లా, కోటనందూరు మండల పరిషత్ కార్యాలయంలో కులాల ఓటర్ల జాబితా విడుదల చేసిన ఎంపీడీవో వెంకటనారాయణ మీడియాకు వివరాలు తెలియజేస్తూ 17 గ్రామపంచాయతీలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లు ఎంతమంది ఉన్నారు అనేది డ్రాఫ్ట్ పబ్లికేషన్ 2026 ఎన్నికల నిమిత్తం కార్యాలయంలో అందుబాటులో ఉంచామని, మండలంలో మొత్తం ఓటర్లు 39,904 మంది ఉన్నారని, ఎస్సీ ఓటర్లు 9,111, ఎస్టీ ఓటర్లు 508, బీసీ ఓటర్లు 25,425, ఇతరులు 4,860 మంది ఓటర్లు ఉన్నారని తెలియజేశారు. ఈ ఓటర్ల జాబితా లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 28వ తేదీలోపు కార్యాలయంలో తెలియజేయాలని ఎంపీడీవో తెలియజేశారు.

# ఆడపిల్లలకు అండగా టీమ్ రక్ష పనిచేస్తుంది



**టీమ్ రక్ష చైర్మన్ కే.కిషోర్ రెడ్డి**

**కోటనందూరు, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్:** ఆడపిల్లలకు అండగా టీం రక్ష పనిచేస్తుందని ఆ సంస్థ చైర్మన్ కె కిషోర్ రెడ్డి తెలిపారు. కాకినాడ జిల్లా,కోటనందూరు మండలం, అప్పలరాజుపేట మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలో మహిళలు ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యలపై టీం రక్ష పనిచేస్తుందన్నారు. అనంతరం మండల పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ సమకూర్చిన ఆట వస్తువులను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి దేవి ప్రసాద్, సిహెచ్ మంగరాజు, భీమిరెడ్డి అప్పలనాయుడు, నల్లమిల్లి గోవిందు, ఏ నానాజీ, బి హరిప్రసాద్,ఎన్ వీర్రాజు,ఎం వి రాజారెడ్డి, ఎమ్ వివేకానంద్, కే కృష్ణ ,బి లోకేష్, సాయి తేజ, అజార్, రోటరీ మరియు రోట్రాక్ట్ సభ్యులు పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల రహిత సమాజాన్ని నిర్మించుకుందాం

**కోటనందూరు ఎస్సై టి.రామకృష్ణ**



**కోటనందూరు, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్:** మత్తు పదార్థాల రహిత సమాజాన్ని నిర్మించుకుందామని ఎస్సై టి.రామకృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాల్లో మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు మైక్ అనౌన్స్మెంట్ ద్వారా వివరించారు. కాకినాడ జిల్లా, కోటనందూరు మండలం,అల్లిపూడి, కే కొట్టాం, పి కొట్టాం, కేఏ మల్లవరం, కే ఓ అగ్రహారం గ్రామాల్లో కోటనందూరు పోలీసులు మాదకద్రవ్యాల వినియోగంపై మరియు దానివల్ల కలిగే దుష్ప్రమాణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో యువత చెడు వ్యసనాలకు బానిసలు అయితే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ కు తెలియజేయాలన్నారు. మండల వ్యాప్తంగా మాదక ద్రవ్యాల నియంత్రణ కొరకు ప్రత్యేక యంత్రాంగం పనిచేస్తుందన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంపై స్పందనకు క్యూఆర్ కోడ్




**కాకినాడ, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా నమోదైన అర్జీల పరిష్కారంపై ప్రజలు తమ అభిప్రాయాన్ని నేరుగా తెలియజేసేందుకు ప్రత్యేక క్యూఆర్ కోడ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాల మేరకు ఈ క్యూఆర్ కోడ్‌పై కాకినాడ జిల్లా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించే చర్యలను జిల్లా పోలీసు శాఖ చేపట్టింది. అర్జీదారులు తమ మొబైల్ ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, తాము దాఖలు చేసిన అర్జీ నంబర్‌కు సంబంధించిన పరిష్కారంపై నేరుగా స్పందన, అభిప్రాయాన్ని నమోదు చేసుకోవచ్చు. ప్రజల నుంచి ఆన్‌లైన్ ద్వారా అందే ప్రతి స్పందనను జిల్లా ఉన్నతాధికారులు నిరంతరం సమీక్షించనున్నారు. అర్జీల పరిష్కారం నాణ్యత, సమస్య పరిష్కారంలో తీసుకున్న చర్యలను పరిశీలించి, అవసరమైన సందర్భాల్లో అధికారికంగా, చట్టపరంగా తగిన చర్యలు తీసుకునేలా ఈ విధానం దోహదపడనుంది. ప్రజలకు మరింత పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం ఈ సాంకేతిక విధానాన్ని ప్రవేశపెట్టింది. కాకినాడ జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ అర్జీల పరిష్కారంపై స్పందనను తెలియజేయాలని జిల్లా పోలీసు శాఖ కోరింది. ప్రజల అభిప్రాయాల ఆధారంగా సమస్యల పరిష్కారంలో మరింత నాణ్యత, పారదర్శకత తీసుకురావడానికి ఈ విధానం ఉపయోగపడుతుందని పోలీసు శాఖ వెల్లడించింది.

# కోటనందూరులో మస్జిద్ ఏ రసూల్ నూతన మసీదు ప్రారంభం



**కోటనందూరు, ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్:** కాకినాడ జిల్లా కోటనందూరులో మసీద్ ఏ రసూల్ నూతన మసీదు ప్రారంభించారు. సుమారు 35 లక్షల రూపాయలతో నిర్మించిన ఈ మసీదు ముస్లిం పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు అనంతరము మంగళవారం ఉదయం 9:30 గంటలకు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనాబ్ మహమ్మద్ రఫీ, జనాభా ఎస్కే అల్తార్ విచ్చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉత్తమ సమాజ నిర్మాణం సర్వమత సమ్మేళనం హిందూ ముస్లిం క్రిస్టియన్ ఐక్యతతోనే సమసమాజ స్థాపన కొనసాగుతుందని అన్నారు. మస్జిద్ ఏ రసూల్ ప్రెసిడెంట్ షేక్ మీరాబాయి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో కుల మతాలకు అతీతంగా ఐక్యతతోనే ఉంటామని తెలియజేస్తూ, మిత్రులకు సహకరించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నజీర్ అహ్మద్ ఖాన్, షేక్ యాకుబ్, అబ్దుల్ సత్తార్, మహమ్మద్ రిజ్వాన్, ఖురేషిద్దాయి, స్థానిక మసీదు పెద్దలు దర్గా మదీనా, బడా హుస్సేన్, షేక్ ఇసాక్ మరియు కోటనందూరు గ్రామ పెద్దలు అమలకంటి కొండలరావు, వెలగా గంగాధర రంగనాయకులు, డాక్టర్ వెలగా వెంకటకృష్ణారావు, కొరుప్రోలు రఘు, బోడపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.








కలెక్టరేట్ లో నమోదు చేసిన ఫిర్యాదు రసీదు

## కలెక్టర్‌కు చేరిన ఫిర్యాదు.. సమగ్ర విచారణకు డిమాండ్
## ఫిర్యాదు ఫైల్‌గానే మిగిలిపోతుందా..? లేక వాస్తవాలు వెలుగులోకి వస్తాయా..!

**రాయవరం, ఆగస్టు 25, విశ్వంవాయిస్ న్యూస్ :**
ప్రజల కోసం ఉద్దేశించిన పంచాయతీ నిధులు పక్కదారి పడుతున్నాయన్న ఆరోపణలు, పంచాయతీ ఆస్తుల రికార్డులు కనిపించకపోవడం, నాసిరకం అభివృద్ధి పనులు, గ్రామసభల నిర్వహణలో లోపాలు.. ఇలా పలు తీవ్ర ఆరోపణలు పసలపూడి గ్రామపంచాయతీపై వెల్లువెత్తుతున్నాయి. సమస్యలపై గ్రామస్తులు పలు మార్లు అధికారులను ఆశ్రయించినప్పటికీ ఆశించిన స్థాయిలో పరిష్కారం లభించకపోవడం ఇప్పుడు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఈ నేపథ్యంలో పసలపూడి గ్రామస్తులతో కలిసి చింతా తమ్మిరెడ్డి సోమవారం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్కు పీజీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదు చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు పంచాయతీలో జరిగిన అన్ని ఆర్థిక లావాదేవీలు, అభివృద్ధి పనులు, నిధుల వినియోగం, పంచాయతీ ఆస్తులు, పరిపాలనా నిర్ణయాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన కోరారు.

**నిధుల మళ్లింపుపై తీవ్ర ఆరోపణలు**

పసలపూడి గ్రామపంచాయతీలో ప్రజా అవసరాల కోసం వినియోగించాల్సిన పంచాయతీ నిధులపై తీవ్ర ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ముఖ్యంగా పిఎఫ్ఎంఎస్ ద్వారా జరగాల్సిన చెల్లింపుల్లో నిబంధనలను పక్కనపెట్టి, డిపిటి విధానాన్ని పాటించకుండా పంచాయతీకి సంబంధించిన నిధులను వ్యక్తిగత బ్యాంకు ఖాతాల వైపు మళ్లించినట్లు ఫిర్యాదులో ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, పాలకవర్గం లేదా సంబంధిత సిబ్బంది పాత్రపై కూడా సమగ్రంగా విచారణ జరపాలని ఫిర్యాదుదారు కోరారు. అదేవిధంగా గ్రామాభివృద్ధి కోసం కేటాయించే ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులు తదితర ప్రభుత్వ నిధుల వినియోగంలోనూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏ పనికి ఎంత నిధులు మంజూరయ్యాయి? ఎంత మొత్తాన్ని ఖర్చు చేశారు? ఎవరికి చెల్లింపులు చేశారు? చెల్లింపులకు సంబంధించిన బిల్లులు, వౌచర్లు, తీర్మానాలు, పనుల కొలత పుస్తకాలు, పూర్తి చేసిన పనుల వివరాలు ఏమిటి? అన్న అంశాలపై స్పష్టత రావాల్సిన అవసరం ఉంది. అయితే ఇవి ప్రస్తుతం ఫిర్యాదులో చేసిన ఆరోపణలు మాత్రమే. వాటిలో వాస్తవమెంత? ఆరోపణలకు ఆధారాలున్నాయా? నిధులు నిజంగా నిబంధనలకు విరుద్ధంగా మళ్లించబడ్డాయా? అన్నది అధికారిక విచారణలోనే తేలాల్సి ఉంటుంది. అందుకే ఈ వ్యవహారంలో కేవలం పంచాయతీ రికార్డులను పరిశీలించడం సరిపోదని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. బ్యాంకు ఖాతాల లావాదేవీలు, పిఎఫ్ఎమ్ఎస్ చెల్లింపుల వివరాలు, డిపిటి ప్రక్రియ, బిల్లులు, వౌచర్లు, తీర్మానాలు, చెక్కులు, పనుల కొలత పుస్తకాలు, కాంట్రాక్టర్లకు, సరఫరాదారులకు చేసిన చెల్లింపులు, క్షేత్రస్థాయిలో జరిగిన పనుల వాస్తవ పరిస్థితి వంటి అంశాలను ఒకదానితో ఒకటి సరిపోల్చి పరిశీలించాల్సి ఉంది. ప్రభుత్వ నిధులు ప్రజల సొమ్ము కావడంతో ఒక్క రూపాయి కూడా నిబంధనలకు విరుద్ధంగా వినియోగించబడిందనే అనుమానం వచ్చినా అధికారులు లోతైన విచారణ జరపాల్సిన బాధ్యత ఉంది. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు, దుర్వినియోగమైన నిధుల రికవరీ జరగాలి. ఆరోపణల్లో వాస్తవం లేకపోతే అదే విషయాన్ని ఆధారాలతో ప్రజలకు స్పష్టం చేయాలి. దీనికోసమై పసలపూడి పంచాయతీలో 2024-25 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని నిధుల లావాదేవీలపై స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**రికార్డులు ఎక్కడున్నాయి..?**

గ్రామపంచాయతీకి చెందిన ఆస్తుల విషయంలో సైతం పలు అనుమానాలు, ఆరోపణలు తెరపైకి రావడం కలకలం రేపుతోంది. పంచాయతీకి చెందిన భూములు, భవనాలు, స్థలాలు, ప్రజా వినియోగానికి సంబంధించిన ఆస్తులు, ఇతర స్థిరాస్తులకు సంబంధించి సంపూర్ణమైన అధికారిక రికార్డులు అందుబాటులో లేవన్న ఆరోపణలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. పంచాయతీకి చెందిన ఆస్తులు ఎక్కడ ఉన్నాయి? వాటి విస్తీర్ణం ఎంత? ఏ సర్వే నంబరులో ఉన్నాయి? వాటి ప్రస్తుత వినియోగం ఏమిటి? పంచాయతీ ఆస్తుల రిజిస్టర్లో వాటి వివరాలు నమోదు చేశారా? ఆస్తులకు సంబంధించిన పత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలు, పాత రికార్డులు, మ్యాపులు, పన్ను వివరాలు తదితరాలు పంచాయతీ వద్ద సక్రమంగా ఉన్నాయా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సిన అవసరం ఉంది. ప్రజా ఆస్తులు అంటే ఎవరి వ్యక్తిగత ఆస్తులు కావు. అవి గ్రామ ప్రజలకు చెందిన ప్రభుత్వ ఆస్తులు. వాటి రక్షణ, నిర్వహణ, రికార్డుల పరిరక్షణ పంచాయతీ అధికారుల బాధ్యత. ఆస్తి ఉన్నా రికార్డు లేకపోతే.. రికార్డు ఉన్నా ఆస్తి కనిపించకపోతే.. అసలు ఆస్తి పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తప్పకుండా ఉత్పన్నమవుతుంది. ముఖ్యంగా పంచాయతీకి చెందిన స్థలాలు లేదా భవనాలు ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లాయా? ఆక్రమణలకు గురయ్యాయా? ఏదైనా ఆస్తిని అనుమతులు లేకుండా ఇతరులు వినియోగిస్తున్నారా? పంచాయతీ ఆస్తులను లీజుకు ఇచ్చి ఉంటే దానికి సంబంధించిన తీర్మానాలు, ఒప్పందాలు, లీజు మొత్తం, వసూలైన ఆదాయం వంటి వివరాలు సక్రమంగా ఉన్నాయా? అన్న విషయాలపై కూడా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం ప్రస్తుత రికార్డులను చూడటం కాకుండా పాత పంచాయతీ రికార్డులు, ఆస్తుల రిజిస్టర్, రెవెన్యూ రికార్డులు, సర్వే నంబర్లు, రిజిస్ట్రేషన్ పత్రాలు, పంచాయతీ తీర్మానాలు, సంబంధిత అధికారుల నివేదికలను పరస్పరం సరిపోల్చి పరిశీలించాలి. అవసరమైతే క్షేత్రస్థాయిలో ఆస్తులను కొలతలు వేసి వాటి వాస్తవ స్థితిని కూడా నిర్ధారించాలని కోరుతూనే ఆస్తుల రికార్డులు నిజంగానే గల్లంతయ్యాయా? లేక రికార్డులు ఉన్నప్పటికీ వాటిని సక్రమంగా నిర్వహించడంలో నిర్లక్ష్యం జరిగిందా? ఏదైనా ఆస్తి విషయంలో అక్రమ లావాదేవీలు లేదా ఆక్రమణలకు అవకాశం కల్పించారా? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ప్రజా ఆస్తులకు సంబంధించిన రికార్డుల విషయంలో నిర్లక్ష్యం జరిగితే అది కేవలం పరిపాలనా లోపంగా తీసుకోకుండా, బాధ్యత ఎవరిది అన్నది కూడా నిర్ధారించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే నేడు రికార్డు కనిపించకపోతే రేపు ఆ ఆస్తిపై వివాదం తలెత్తినప్పుడు గ్రామ ప్రజల ప్రయోజనాలను ఎవరు కాపాడాలని పిర్యాదు లో పేర్కొన్నారు. పంచాయతీకి చెందిన అన్ని ఆస్తులను గుర్తించి, వాటి రికార్డులను పునఃపరిశీలించి, వాస్తవ స్థితిని బహిర్గతం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. “పంచాయతీ ఆస్తులు ఎన్ని? వాటి రికార్డులు ఎక్కడ? ప్రస్తుతం వాటి ఆధీనంలో ఎవరు ఉన్నారు?” అనే ప్రశ్నలకు అధికార యంత్రాంగం స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన సమయం వచ్చిందని చెబుతున్నారు.

**నాసిరకం పనులపై ఫిర్యాదులు.. ఫలితం శూన్యం?**

గ్రామంలో జరిగిన పలు అభివృద్ధి పనుల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణం పూర్తయి కొంతకాలం కూడా గడవకముందే పలు సీసీ రోడ్లు బీటలు వారడం పనుల నాణ్యతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. దీనిపై గ్రామానికి చెందిన పలువురు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించలేదని ఆరోపిస్తున్నారు. ప్రజల సౌకర్యం కోసం ప్రభుత్వ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభం కాకముందే, కొద్దికాలానికే బీటలు వారడం జరిగితే, నిర్మాణంలో ఉపయోగించిన మెటీరియల్ నాణ్యత, కాంక్రీట్ ప్రమాణాలు, పనుల పర్యవేక్షణపై అనుమానాలు రావడం సహజమే. అంచనా ప్రకారం పనులు జరిగాయా? నాణ్యమైన మెటీరియల్ ఉపయోగించారా? ఇంజినీరింగ్ ప్రమాణాలు పాటించారా? అన్నది అధికారులు తేల్చాల్సి ఉంది. ఇదే అంశంపై పీజీఆర్ఎస్లో ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్న ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఫిర్యాదు వచ్చినప్పుడు కేవలం రికార్డుల్లో పరిశీలన చేయడం కాకుండా, అధికారులు క్షేత్రస్థాయిలో రోడ్డును పరిశీలించి, సాంకేతికంగా నాణ్యతను పరీక్షించారా? అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్న. పనుల్లో లోపాలు ఉన్నట్లు తేలితే సంబంధిత కాంట్రాక్టర్తో పాటు పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన అధికారుల బాధ్యతను నిర్ధారించి చర్యలు తీసుకోవాలి. అవసరమైతే పనులకు సంబంధించిన అంచనా పత్రాలు, వర్క్ ఆర్డర్లు, కొలత పుస్తకాలు, బిల్లులు, చెల్లింపుల వివరాలను కూడా పరిశీలించాలి. ప్రజాధనంతో నిర్మించిన రోడ్లు కొద్దికాలానికే బీటలు వారితే.. దానికి కారణం ఏమిటో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత అధికారులదే. కొవ్వూరి సుధాకర్రెడ్డి చేసిన ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**సులభ్ కాంప్లెక్స్ నుంచి పీజీఆర్ఎస్ వరకు.. ప్రశ్నలే ప్రశ్నలు**

పసలపూడి పంచాయతీలో సులభ్ కాంప్లెక్స్ కూల్చివేత, గ్రామసభల నిర్వహణ, పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై సైతం పలు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వ స్థలంలో గతంలో నిర్మించిన సులభ్ కాంప్లెక్సును ప్రైవేట్ వ్యక్తులు కూల్చివేశారన్న ఆరోపణలు ఉండగా, దీనిపై పీజీఆర్ఎస్లో ఫిర్యాదు చేసినా తగిన చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రభుత్వ స్థలంలోని ప్రజా సౌకర్యాన్ని ఎవరి అనుమతితో కూల్చివేశారు? బాధ్యులెవరు? అన్నది తేలాల్సి ఉండగా గ్రామసభలు నిర్వహించకుండానే తీర్మానాలు చేసినట్లు నమోదు చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. గ్రామసభ జరగకపోతే తీర్మానం ఎలా? ప్రజల భాగస్వామ్యం లేకుండా నిర్ణయాలు ఎలా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరోవైపు ప్రజలు చేసిన ఫిర్యాదులు పరిష్కరించకుండానే దాదాపు 90 శాతం పీజీఆర్ఎస్ అర్జీలను తప్పుడు సమాచారంతో క్లోజ్ చేస్తున్నారన్న ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. సమస్య పరిష్కారం కాకుండానే ఫిర్యాదు మూసివేస్తే ప్రజలు తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఈ అంశాలన్నింటిపై ఉన్నతాధికారులతో నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ కు చేసిన ఫిర్యాదులు పేర్కొన్నారు

**ఫిర్యాదు ఫైల్‌గా మిగిలిపోతుందా !..**
**లేక ఫైల్ తెరచి వాస్తవాలు వెలుగులోకి వస్తాయా .!**

పసలపూడి గ్రామపంచాయతీలో నిధుల వినియోగం, ఆర్థిక వ్యవహారాలు, పంచాయతీ ఆస్తుల రికార్డులు, అభివృద్ధి పనుల నాణ్యత, గ్రామసభల నిర్వహణ, పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలను జోడించి పూర్తి వివరాలను జిల్లా కలెక్టర్ కు గ్రామస్తులు సమర్పించగా ఇప్పుడు జిల్లా యంత్రాంగం స్పందనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ వ్యవహారంపై 2024-25 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని లావాదేవీలు, పనులు, పరిపాలనా నిర్ణయాలపై సమగ్ర ఆడిట్‌తో కూడిన నిష్పక్షపాత విచారణ జరిపించాలని చింతా తమ్మిరెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరగా ఇక్కడితో అసలు ప్రశ్న మొదలవుతోంది. ఫిర్యాదును మరో అధికారికి పంపించి నివేదిక కోరడమేనా? లేక ఆరోపణల మూలాలను వెలికితీసేలా ప్రత్యేక బృందంతో లోతైన విచారణ జరిపిస్తారా? అన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. నిధుల వినియోగంపై ఆరోపణలు ఉన్న నేపథ్యంలో బ్యాంకు లావాదేవీలు, పి ఎఫ్ ఎం ఎస్ చెల్లింపులు, బిల్లులు, వౌచర్లు, తీర్మానాలు, కొలత పుస్తకాలు, పనుల నాణ్యత, పంచాయతీ ఆస్తుల రికార్డులు వంటి అంశాలన్నింటినీ పరస్పరం సరిపోల్చి పరిశీలిస్తేనే వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది. అదే సమయంలో పీజీఆర్ఎస్ ఫిర్యాదులు ఎలా పరిష్కరించబడ్డాయి? క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించకుండానే అర్జీలు మూసివేశారా? అన్నదీ తేలాల్సి ఉంది. ఆరోపణలు నిజమని తేలితే ప్రభుత్వ నిధుల రికవరీతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు. ఆరోపణలు నిరాధారమని తేలితే ఆ విషయాన్ని కూడా ఆధారాలతో ప్రజలకు వెల్లడించాల్సిన బాధ్యత అధికారులదే. ఇప్పటివరకు పసలపూడి పంచాయతీ వ్యవహారాలపై వినిపిస్తున్నవి ఆరోపణలే. వాటికి నిజానిజాలు తేలేది మాత్రం అధికారిక విచారణలోనే. అందుకే ఈ ఫిర్యాదును సాధారణ ఫిర్యాదుగా పరిగణించకుండా ప్రజాధనం, ప్రజా ఆస్తులు, ప్రజా పాలనకు సంబంధించిన అంశంగా జిల్లా కలెక్టర్ ఎంత తీవ్రంగా పరిగణిస్తారన్నదే ఇప్పుడు కీలకంగా మారింది. పసలపూడి పంచాయతీపై ఆరోపణలకు జిల్లా యంత్రాంగం సమాధానం ఇస్తుందా..? అనే అంశంపై గ్రామస్తులతో పాటు జిల్లా ప్రజల దృష్టి సైతం కలెక్టర్ తదుపరి నిర్ణయంపైనే ఉంది.

అనపర్తి కోర్టులో తొలి మధ్యవర్తులుగా

## ఇద్దరు న్యాయవాదులు



**అనపర్తి, ఆగస్టు 25, విశ్వంవాయిస్ న్యూస్ :** కోర్టుల్లో వివిధ కారణాలతో పెండింగ్లో ఉన్న వివాదాలను సుదీర్ఘ న్యాయ ప్రక్రియకు వెళ్లకుండా, ఇరుపక్షాల అంగీకారంతో సఖ్యతపూర్వకంగా పరిష్కరించడంలో మధ్యవర్తిత్వ విధానం కీలకంగా ఉండనున్న నేపథ్యంలో అనపర్తి కోర్టులో మధ్యవర్తుల నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. తూర్పుగోదావరి జిల్లా, అనపర్తి కోర్టు చరిత్రలో తొలిసారిగా ఇద్దరు న్యాయవాధులు మధ్యవర్తులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా అనపర్తి ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వంశీకృష్ణ చేతుల మీదుగా సోమవారం మధ్యవర్తులుగా నియమితులైన వెలగల లక్ష్మీనారాయణ రెడ్డి, కోనాల శ్రీధర్ రెడ్డిలు సర్టిఫికెట్లు అందుకున్నారు. మధ్యవర్తులుగా నియమితులైన వెలగల లక్ష్మీనారాయణ రెడ్డి, కోనాల శ్రీధర్ రెడ్డిలు సంబంధిత అంశాల్లో ఇరుపక్షాల అభిప్రాయాలను తెలుసుకుని, పరస్పర అంగీకారంతో సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయనున్నారు. తద్వారా చిన్నచిన్న వివాదాలు సైతం కోర్టు కేసులుగా మారకుండా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునే అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా న్యాయమూర్తి వంశీకృష్ణ మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలను స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవడం వల్ల ఇరుపక్షాలకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు పరస్పర సంబంధాలు కూడా కొనసాగుతాయని పేర్కొన్నారు. అనపర్తి కోర్టులో తొలిసారిగా మధ్యవర్తులుగా బాధ్యతలు స్వీకరించిన వెలగల లక్ష్మీనారాయణ రెడ్డి, కోనాల శ్రీధర్ రెడ్డిలకు పలువురు న్యాయవాదులు, న్యాయస్థాన సిబ్బంది, ప్రముఖులు అభినందనలు తెలిపారు. మధ్యవర్తిత్వ విధానం ద్వారా మరిన్ని వివాదాలు సామరస్యపూర్వకంగా పరిష్కారం కావాలని ఆకాంక్షించారు.

రానున్న ఎన్నికల్లో పోటీ చేసేవారు

## ప్రజలతో మమేకమవ్వండి : బత్తుల

– విలీన గ్రామాల్లో ఎన్నికలు
– త్వరలో 3లక్షల పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, లోన్లు




**కోరుకొండ ఆగస్టు 25, విశ్వం వాయిస్ న్యూస్ :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే ఆశావాహులు ఇప్పటినుండే ప్రజలతో నేరుగా మమేకం కావాలని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం జంబుపట్నం రాజా కన్వర్షన్ హాల్ లో నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో స్థానికసంస్థల ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే ఆశావాహులు ఇప్పటినుండి ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. త్వరలో ఎన్నికల కమిషన్ నుంచి అధికారికంగా ప్రకటన వెలువడనుందని, గ్రామ వార్డు, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి అభ్యర్థుల ప్రకటన, రిజర్వేషన్ వంటి అంశాలలో తుది నిర్ణయం పవన్ కళ్యాణ్ ప్రకటిస్తారన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ లో విలీన సమస్యను పక్కనపెట్టి, త్వరలో తప్పనిసరిగా పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఆశావాహులందరూ ప్రత్యక్షంగా ప్రజల్లోకి వెళ్లి, ప్రజా విశ్వాసాన్ని పొందిన వారికే పవన్ టికెట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. స్థానిక సంస్థఎన్నికల ముందే అర్హులైన 3లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అదేవిధంగా అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు,ఇంటి నిర్మాణానికి లోన్లు కూడా వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, అడ్డాల శ్రీను, అడపా శ్రీనివాస్, అడ్డాల శివ చక్రవర్తి, మేడిశెట్టి శివరాం, యర్రంశెట్టి పోలారావు, బదిరెడ్డి దొర, ముక్క రాంబాబు, తన్నీరు తాతాజీ, జాజుల గణేష్, తలగంశెట్టి శివ, తాటికొండ బుజ్జి, పార్టీ నాయకులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## చెడు వ్యసనాలకు చెక్ పెట్టండి

లొల్ల గ్రామంలో ‘పల్లెనిద్ర’ ద్వారా పోలీసుల అవగాహన కార్యక్రమం – పలు సూచనలు చేసిన సిఐ దొరరాజు



**రాయవరం, ఆగస్టు 25, విశ్వంవాయిస్ న్యూస్:** యువత గంజాయి, మద్యం, క్రికెట్ బెట్టింగ్, పేకాట వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, మంచి మార్గంలో పయనించాలని మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు సూచించారు. లొల్ల గ్రామంలో మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, రాయవరం ఎస్సై డి.సురేష్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం ‘పల్లె నిద్ర’ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో సీఐ దొరరాజు మాట్లాడుతూ యువతలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం పెరుగుతుండటం ఆందోళనకరమన్నారు. మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల యువత ఆరోగ్యం, కుటుంబ జీవితం, భవిష్యత్తు దెబ్బతినడంతో పాటు సమాజంపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. గ్రామంలో గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగానికి సంబంధించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అలాగే గ్రామ ప్రజలతో నేరుగా మాట్లాడి స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్రికెట్ బెట్టింగ్, పేకాట వంటి వ్యసనాలకు కూడా యువత దూరంగా ఉండాలని, సమాజంలో శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీసులకు ప్రజలు సహకరించాలని సీఐ, ఎస్సై కోరారు. ఏదైనా సమాచారం ఉంటే సీఐ 9440796537, ఎస్సై 9440904843 నంబర్లకు తెలియజేయాలని సూచించారు.




# మహేష్ బాబుతో నెక్ట్స్ మూవీ..

## క్లారిటీ ఇచ్చిన అనిల్ రావిపూడి..!



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఎస్ఎస్.రాజమౌళి దర్శకత్వంలో తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి' షూటింగ్‌తో బిజీగా ఉన్నాడు. భారీ అడ్వెంచరస్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రం 2027 ఏప్రిల్‌లో విడుదలకు సిద్ధమవుతోంది. అయితే, 'వారణాసి' పూర్తయిన వెంటనే మహేష్ బాబు తన నెక్ట్స్ చిత్రం ఎవరితో చేస్తున్నాడనే విషయంపై సోషల్ మీడియాలో ఓ వార్త జోరుగా చక్కర్లు కొడుతోంది. సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడితో మహేష్ మరోసారి జతకట్టనున్నాడని వార్త సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో 'సరిలేరు నీకెవ్వరు' అనే బ్లాక్‌బస్టర్ హిట్ వచ్చింది. ఇక త్వరగా సినిమాలు తీసే అనిల్ రావిపూడితో ఓ సినిమాను వీలైనంత స్పీడ్‌గా తీయాలని మహేష్ భావిస్తున్నాడని.. అందుకే వీరి కాంబో సెట్ కాబోతోందనే వార్త జోరుగా చక్కర్లు కొడుతోంది. కాగా ఈ ప్రచారంపై దర్శకుడు అనిల్ రావిపూడి క్లారిటీ ఇచ్చాడు. మహేష్ బాబు అంటే తనకు ఎంతో గౌరవం అని.. తనతో ఆయన ఎప్పుడూ ప్రేమగా ఉంటాడని అనిల్ తెలిపాడు. కానీ, తమ కాంబినేషన్‌లో ఓ సినిమా రాబోతుందనే వార్తల్లో నిజం లేదని.. ఇలాంటి తప్పుడు వార్తలను ఫ్యాన్స్ నమ్మవద్దని ఆయన కోరాడు. దీంతో ఈ పుకార్లు చెక్ పడింది.

# 'జై హనుమాన్', 'మహాకాళి' ఓకే..

## ఆ సూపర్ హీరో సినిమా ఏమయ్యాడు?




ఇండియన్ సినిమా దగ్గర అతి తక్కువ టచ్ చేసిన జానర్ లలో ఒకటైన సూపర్ హీరో జానర్ నుంచి మన టాలీవుడ్ లో వచ్చిన మొదటి సినిమానే సూపర్ హిట్ అయ్యింది. దర్శకుడు ప్రశాంత్ వర్మ, తేజ సజ్జ కలయికలో వచ్చిన హను మాన్ భారీ హిట్ కాగా ఆ తర్వాత దర్శకుడు ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్ ని సిద్ధం చేస్తున్నట్టు క్లారిటీ ఇచ్చాడు. ఇక వీటిలో భాగంగా జై హనుమాన్, ఇంకా మహాకాళి వంటి సినిమాలు కూడా రాబోతున్నాయి. కానీ అసలు వీటి అన్నిటికంటే ముందే అంటే ఎప్పుడో ఆర్ఆర్ఆర్ కూడా రావడానికి ముందే అనౌన్స్ చేసిన భారీ సూపర్ హీరో చిత్రం 'అధీర' పరిస్థితి మాత్రం ఏమయ్యింది అనేది ఇప్పటికీ క్లారిటీ లేదు. డీవీవీ దానయ్య తనయుడు కళ్యాణ్ హీరోగా పరిచయం అవుతూ రివీల్ చేసిన ఫస్ట్ గ్లింప్స్ కే మంచి రెస్పాన్స్ వచ్చింది. కానీ మళ్ళీ కొన్నాళ్ల పాటు ఆ సినిమా ఏమైందో కూడా తెలియరాలేదు. మళ్ళీ గత ఏడాది పవన్ ఓజి సినిమా విడుదల చేస్తున్న సమయంలో ఎస్ జే సూర్యని విలన్ గా చూపిస్తూ ఒక్క పోస్టర్ విడుదల చేశారు. ఇలా దీని తర్వాత అనౌన్స్ అయ్యిన సినిమాలే ఇప్పుడు పూర్తవుతూ, రిలీజ్ కి కూడా వస్తున్నాయి కానీ అధీర మాత్రం ఏమయ్యాడో అనేది ఇంకా క్లారిటీ లేదు. సో దీనిపై మేకర్స్ ఏమన్నా క్లారిటీ ఇస్తారేమో చూడాలి.

# నాగార్జున, అర్జున్ వంటి స్టార్ హీరోలతో సినిమాలు..

## 15 ఏళ్లు చిన్నవాడితో ప్రేమాయణం.. 50 ఏళ్ల వయసులో స్టిల్ సింగిల్..



ఒకప్పుడు భారతీయ సినీ పరిశ్రమలో తోపు హీరోయిన్. 5 సంవత్సరాల క్రితం తన ప్రియుడితో బ్రేకప్ జరిగింది. అయినప్పటికీ ఈ మాజీ ప్రేమికులు ఇప్పటికీ స్నేహితులుగా కొనసాగుతున్నారు. దాదాపు 15 ఏళ్ల చిన్నవాడితో ప్రేమాయణం జరిగింది. ఇప్పుడు ఆమె వయసు 50 సంవత్సరాలు. ప్రస్తుతం సినిమాల్లో కీలకపాత్రలు పోషిస్తూ ప్రేక్షకులను అలరిస్తుంది. ఇంతకీ ఆ నటి ఎవరో తెలుసా..? తెలుగులో ఒకప్పుడు నాగార్జున సరసన బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఆ తర్వాత కన్నడ హీరో అర్జున్ జోడిగా ఓ స్పెషల్ సాంగ్ చేసింది. అప్పట్లో ఆమె భారతీయ సినిమా ప్రపంచంలో తనదైన ముద్ర వేసింది. అయితే కొన్నాళ్ల క్రితం ఆమె తన పర్సనల్ విషయాలతో వార్తలలో నిలిచింది. తనకంటే 15 ఏళ్ల చిన్నవాడితో ఆమమె ప్రేమాయణం ఫిల్మ్ వర్గాల్లో హాట్ టాపిక్ అయ్యింది. ఇంతకీ ఆమె ఎవరో కాదు.. హీరోయిన్ సుష్మితా సేన్. ఒకప్పుడు రోహ్మాన్ షాల్ అనే యువకుడితో ఆమె డేటింగ్ సంచలనం సృష్టించింది. వారు డేటింగ్ ప్రారంభించినప్పుడు సుష్మిత వయసు 42 కాగా, రోహ్‌మన్ వయసు అప్పుడు 27 సంవత్సరాలు. 2018లో వారి సంబంధం బహిరంగం కావడానికి ముందు, వారిద్దరూ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం అయ్యారు. రోహ్మాన్ సుష్మిత కుటుంబ జీవితంలో ఒక ముఖ్యమైన భాగమయ్యాడు. అతనికి తన కుమార్తెలు రెనీ , అలీసాలతో గొప్ప అనుబంధం ఉండేది. అతను తరచుగా కుటుంబ కార్యక్రమాలలో , విహారయాత్రలలో ఆ నటితో కలిసి కనిపించేవాడు. సుష్మిత తరచుగా వారి రొమాంటిక్ క్షణాలను సోషల్ మీడియాలో పంచుకునేది. దాదాపు మూడేళ్ల పాటు కలిసి ఉన్న తర్వాత, సుష్మితా సేన్ , రోహ్మాన్ షాల్ విడిపోవాలని నిర్ణయించుకున్నారు. డిసెంబర్ 2021లో, సుష్మిత వారి విడిపోవడాన్ని కన్ఫార్మ్ చేసింది. వారి ప్రేమ బంధం ముగిసినప్పటికీ, వారి మధ్య ఉన్న ప్రేమ , స్నేహం అలాగే నిలిచి ఉన్నాయని ఆమె చెప్పింది. అయితే, విడిపోయినంత మాత్రాన రోహ్మాన్ సుష్మిత జీవితం నుండి వెళ్లిపోలేదు. వారు వివిధ సందర్భాలలో కలుసుకుంటూనే ఉన్నారు. వారిద్దరూ కలిసి కనిపించారు. విడిపోయిన తర్వాత కూడా, వారి స్నేహం త్వరలోనే చర్చనీయాంశంగా మారింది, వారు రహస్యంగా తిరిగి కలిశారా అని అభిమానులు పదేపదే ఆశ్చర్యపోయారు. సుష్మిత కష్టకాలంలో రోహ్మాన్ కూడా ఆమెకు అండగా నిలిచాడు. 2023లో ఆమెకు గుండెపోటు వచ్చిన తర్వాత, అతను ఆమెకు తోడుగా ఉన్నాడు. వారిద్దరూ తమ కుమార్తె అలీసాతో కలిసి కనిపించారు, ఇది వారి సంబంధం ముగిసిన తర్వాత కూడా వారి బంధం కొనసాగుతోందని చూపిస్తుంది. 2024, 2025 వరకు వారు తరచుగా కలిసి కనిపించేవారు. వారు ఈవెంట్లలో , కుటుంబ ఫంక్షన్లలో కలిసి కనిపించేవారు. రోహ్మాన్ తరచుగా సుష్మితకు నిశ్శబ్దంగా మద్దతు ఇస్తూ కనిపించేవారు. 2025 మార్చిలో, అతను నిరంతరం వస్తున్న ఊహాగానాలను ఖండించాడు. ఇదిలా ఉంటే.. సుష్మితా వయసు 50 సంవత్సరాలు. ఇప్పటికీ పెళ్లికి దూరంగా ఒంటరిగా ఉంటుంది.

## ఓటీటీలో సంచలనం సృష్టిస్తున్న ఇరుముడి చిన్నారి సినిమా..

# ఊహించని సస్పెన్స్.. దిమ్మతిరిగే ట్విస్టులు..



ప్రస్తుతం ఓటీటీలో కొత్త కొత్త సస్పెన్స్ థ్రిల్లర్, హారర్ సినిమాలు విడుదలవుతున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు థియేటర్లలో ఇరుముడి సినిమా దుమ్మురేపుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ మూవీలో తన అద్భుతమైన నటనతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది బేబీ నక్షత్ర. అయితే మలయాళంలో నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ తో కలిసి నక్షత్ర నటించిన ఒక సస్పెన్స్ మూవీ ఇప్పుడు డిజిటల్ సంచలనం సృష్టిస్తుంది. ప్రస్తుతం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో థ్రిల్లర్, సస్పెన్స్, క్రైమ్ కథాంశాలకు ప్రేక్షకులలో విశేష ఆదరణ లభిస్తోంది. ముఖ్యంగా బ్యాంక్ రాబరీ (దోపిడీ) నేపథ్యంలో వచ్చే సినిమాలు, వెబ్ సిరీస్‌ల గురించి మాట్లాడేటప్పుడు ప్రతి ఒక్కరికీ నెట్‌ఫ్లిక్స్ పాపులర్ షో 'మనీ హీస్ట్' గుర్తుకు వస్తుంది. అయితే, ఇప్పుడు దానికి ఏమాత్రం తీసిపోకుండా, మరింత ఉత్కంఠభరితమైన కథనంతో ఒక మలయాళీ సినిమా డిజిటల్ ప్రపంచంలో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ఇంతకీ ఈసినిమా కథేంటీ..? సరికొత్త కంటెంట్ ఏంటీ అనే విషయాలు ఇప్పుడు తెలుసుకుందామా. సౌత్ సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన మలయాళ చిత్రం 'ఐ నోబడీ' ప్రస్తుతం ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో ట్రెండింగ్‌లో నిలిచింది. థియేటర్లలో విమర్శకుల ప్రశంసలు పొందిన ఈ చిత్రం, ప్రస్తుతం జియో హాట్‌స్టార్ లో ప్రసారమవుతోంది. సుమారు 2 గంటల 46 నిమిషాల నిడివి ఉన్న ఈ సినిమా, ప్రతి సన్నివేశంలోనూ ప్రేక్షకులు ఊహించని ట్విస్టులతో మైండ్ బ్లాక్ చేస్తోంది. ఈ సినిమా కథ ఒక సాధారణ బ్యాంక్ ఉద్యోగి చుట్టూ తిరుగుతుంది. ఎప్పటిలాగే తన రోజువారీ పనిలో నిమగ్నమై ఉన్న ఆ ఉద్యోగి కళ్ల ముందే, ఒక క్రూరమైన , పక్కా ప్రణాళికతో వచ్చిన దోపిడీ దొంగల ముఠా బ్యాంక్‌పై దాడి చేసి కోట్లాది రూపాయల సొమ్మును దోచుకెళ్తుంది. తన కళ్ల ముందే జరిగిన ఈ ఘోర కలికి ఆ ఉద్యోగి భయపడి వెనకడుగు వేయడు. ఎంతటి ప్రమాదకరమైన పరిస్థితి ఎదురైనా సరే, ఆ అట్టల్ దొంగలను పట్టుకోవాలని, బ్యాంక్ నుంచి దోచుకెళ్లిన ప్రతి ఒక్క రూపాయిని తిరిగి రాబట్టాలని గట్టి పట్టుదలతో నిర్ణయించుకుంటాడు. దక్షిణాది అగ్ర నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ చిత్రంలో సాధారణ బ్యాంక్ ఉద్యోగి పాత్ర నుండి, దొంగలను ఎదుర్కొనే ధైర్యవంతుడిగా రూపాంతరం చెందే క్రమాన్ని ఎంతో శక్తివంతంగా పండించారు. దోపిడీ వెనుక ఉన్న అసలు కారణాలు, పోలీసుల దర్యాప్తు, ప్రధాన పాత్రధారి వేసే వ్యూహాత్మక అడుగులు ప్రేక్షకులలో ప్రతిక్షణం ఉత్కంఠను పెంచుతాయి. కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా, తెలివితో కూడిన రివేంజ్ డ్రామాగా ఈ సినిమా సాగుతుంది.

# మూడో రోజు ముగిసిన ఆట.. శ్రీలంక స్కోర్ 265/8



భారత్, శ్రీలంక మధ్య జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్ మూడో రోజు ఆట ముగిసింది. 84వ ఓవర్లో జడేజా బౌలింగ్ చేస్తుండగా వర్షం పడింది. దీంతో ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌కి వెళ్లిపోయారు. స్టేడియం సిబ్బంది మైదానాన్ని కవర్లతో కప్పేశారు. ఆటను కొనసాగించే వీలు లేకపోవడంతో కొంత సమయం ఉండగానే 83.4 ఓవర్ల వద్ద ఈ రోజుకు మ్యాచ్‌ను ముగించారు. ఆట ముగిసే సమయానికి శ్రీలంక స్కోర్ 265/8. క్రీజులో లాహిరు(8), సోనల్(85) ఉన్నారు. ఇప్పటి వరకు భారత బౌలర్లలో ప్రసిద్ధ్, మానవ్ మూడేసి వికెట్లు తీశారు. సిరాజ్, జడేజా చెరో వికెట్ పడగొట్టారు. శ్రీలంక 238 పరుగులు వెనుకంజలో ఉంది. గత పది ఓవర్లుగా వికెట్ కోసం భారత బౌలర్లు కష్టపడుతున్నారు. సోనల్(83), లాహిరు(8) వికెట్ పడకుండా అప్రమత్తంగా ఆడుతున్నారు. భారత్ కొత్త బాల్‌తో బౌలింగ్ మొదలుపెట్టింది. సారాంశ్ వేసిన 81వ ఓవర్లో లాహిరు ఎల్బీడబ్ల్యూ అంటూ భారత్ అప్పీల్ చేయగా ఎంపైర్ ఔటిచ్చారు. కానీ, శ్రీలంక డీఆర్ఎస్‌కు వెళ్లి సానుకూల ఫలితం దక్కించుకుంది. అనంతరం డ్రింక్స్ బ్రేక్ తీసుకున్నారు. ప్రస్తుతం శ్రీలంక స్కోర్ 262/8. ఇంకా 241 పరుగులు వెనుకంజలో ఉంది. ఒకవైపు వికెట్లు పడుతున్నా సోనల్(77) మాత్రం క్రీజులో పాతుకుపోయాడు. ఆచితూచి ఆడుతూ.. అదును చూసి బౌండరీలు సాధిస్తున్నాడు. 69వ ఓవర్లో మానవ్ వేసిన బంతిని ఎదుర్కొన్న కేశర(13).. సారాంశ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో లాహిరు(5) బ్యాటింగ్‌కు వచ్చాడు. 74 ఓవర్లకు శ్రీలంక స్కోర్ 253/8. ఇంకా 250 పరుగులు వెనుకంజలో ఉంది. గత పది ఓవర్లలో 37 పరుగులు, ఒక వికెట్ వచ్చాయి.

భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టు మూడో రోజు టీ విరామం సమయానికి శ్రీలంక 7 వికెట్లు కోల్పోయి 216 పరుగులు చేసింది. లంక బ్యాటర్ సోనల్ దినుషా(52)(82 బంతుల్లో)అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. మానవ్ వేసిన 62వ ఓవర్‌లో ఒక ఓవర్‌త్రో కారణంగా ప్రత్యర్థి జట్టుకు భారత్ బౌండరీ సమర్పించుకుంది. అంతకుముందు జడేజా వేసిన 59వ ఓవర్‌లో కేశర(13) బ్యాటింగ్ చేస్తుండగా.. ఐదో బంతికి ఎల్బీడబ్ల్యూ కోసం గిల్ డీఆర్ఎస్ తీసుకున్నాడు. అయితే, ఫలితం ప్రతికూలంగా వచ్చింది. దీంతో భారత్ ఒక రివ్యూ కోల్పోయింది. సోనల్, కేశర కలిసి 43 పరుగులు జోడించారు. 65 ఓవర్లకు శ్రీలంక స్కోర్ 216/7. ఇంకా 287 పరుగులు వెనుకంజలో ఉంది. భారత్ తొలి ఇన్నింగ్స్ 503/9. సోనల్(38) క్రీజులో నిలదొక్కుకొని జట్టు స్కోరును క్రమంగా పెంచుతున్నాడు. మరోవైపు కేశర(13) సహకారం అందిస్తున్నాడు. ఈ క్రమంలో ఆతిథ్య జట్టు స్కోర్ 200 దాటింది. సారాంశ్ వేసిన 52వ ఓవర్లో చివరి బంతిని సోనల్ సిక్స్‌గా మలిచాడు. 54వ ఓవర్లో సారాంశ్. 55ఓవర్‌లో జడేజా ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. 57 ఓవర్లకు శ్రీలంక స్కోర్ 202/7.

భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక వరుసగా రెండు ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయింది. పసిందు సూర్యబండార (80)ను రవీంద్ర జడేజా ఔట్ చేశాడు. ఆ తర్వాత ఓవర్‌లో డిక్వెలాను మహ్మద్ సిరాజ్ డకౌట్‌గా పెవిలియన్‌కు పంపించాడు. శ్రీలంక స్కోరు: 45.3 ఓవర్లలో 173/7. ఆ జట్టు ఇంకా 330 పరుగులు వెనుకబడి ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 503/9 స్కోరు చేసిన విషయం తెలిసిందే. శ్రీలంక బ్యాటర్లు సోనల్(15), పసిందు(75) నిలకడగా ఆడుతున్నారు. 41వ ఓవర్‌లో మానవ్ వేసిన నాలుగో బంతిని సోనల్ డీప్ మిడ్ వికెట్ మీదుగా భారీ సిక్స్ కొట్టాడు. 41 ఓవర్లకు శ్రీలంక స్కోర్ 160/5. ఇంకా 343 పరుగులు వెనుకబడి ఉంది.

లంచ్ బ్రేక్ తర్వాత వర్షం పడటంతో మ్యాచ్ కాస్త ఆలస్యంగా ప్రారంభమైంది. అయితే, కాసేపటికే లంక ఐదో వికెట్ కోల్పోయింది. మానవ్ వేసిన బంతి(34.5ఓవర్) ధనంజయ(8) బ్యాట్ ఎడ్జ్‌కి తాకి రాహుల్ చేతికి చిక్కింది. ధనంజయ ఔట్ కావడంతో అతడి స్థానంలో సోనల్ దినుషా క్రీజులోకి వచ్చాడు. మరో ఎండ్‌లో పసిందు(68) నిలకడగా ఆడుతున్నాడు. 35 ఓవర్లకు శ్రీలంక స్కోర్ 137/5. లంచ్ బ్రేక్ సమయంలో వర్షం కురవడంతో ఆట ఇంకా మొదలుకాలేదు. ప్రస్తుతం కప్పి ఉంచిన కవర్లను తొలగించారు. అంపైర్లు వచ్చి మైదానాన్ని పరిశీలిస్తున్నారు.

భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టు మూడో రోజు భోజన విరామ సమయానికి శ్రీలంక 4 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. పసిందు(65) అర్ధశతకం నమోదు చేసుకున్నాడు. మరో ఎండ్‌లో ధనంజయ(4) ఉన్నాడు. తొలి సెషన్‌లో లంక జట్టు కమిల్(19), కమిందు(32) వికెట్లు కోల్పోయింది. వీరిద్దరూ ప్రసిద్ధ్ బౌలింగ్‌లోనే ఔటయ్యారు. ఆతిథ్య జట్టు ఇంకా 373 పరుగులు వెనుకంజలో ఉంది. ఆటగాళ్లు డ్రెస్సింగ్‌రూమ్‌కు వెళ్లగానే మైదానాన్ని స్టేడియం సిబ్బంది కవర్లతో కప్పేశారు. వర్షం పడకపోయినా.. ముందస్తు చర్యల్లో భాగంగా కవర్లు కప్పినట్లు తెలుస్తోంది. శ్రీలంక నాలుగో వికెట్ కోల్పోయింది. ప్రసిద్ధ్ బౌలింగ్(29.6)లో కమిందు(32).. జడేజా చేతికి చిక్కాడు. నాలుగో వికెట్‌కి పసిందుతో కలిసి 87 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. అతడి స్థానంలో ధనంజయ డి సెల్వ క్రీజులోకి వచ్చాడు.

# ముగిసిన డబ్ల్యుపిఎల్ వేలం..

## అమరావతి ఈ ఛాంపియన్స్ జట్టు ఇదే





విమెన్ ఆంధ్రా ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ సెప్టెంబర్ 15 నుంచి 26 వరకు జరగనుంది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఈ లీగ్‌ను నిర్వహిస్తోంది. ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ (రామోజీ గ్రూప్) తమ జట్టుకు అమరావతి ఈ-ఛాంపియన్స్ అని నామకరణం చేసింది. రాయలసీమ జెన్ స్టార్స్, గోదావరి గోల్డెన్ ఈగిల్స్, వైజాగ్ ఫైర్ బర్డ్స్ జట్లు కూడా పోటీపడుతున్నాయి. మంగళవారం విజయవాడలో ప్లేయర్ల వేలం నిర్వహించారు. నాలుగు ఫ్రాంఛైజీలు మొత్తం 74 మంది క్రీడాకారులను కొనుగోలు చేశాయి. ఆల్‌రౌండర్ హెర్నిటా ప్లవియా అత్యధిక ధర పలికింది. ఈమెను రూ.4.30 లక్షలకు గోదావరి గోల్డెన్ ఈగిల్స్ దక్కించుకుంది.

**అమరావతి ఈ ఛాంపియన్స్ జట్టు ఇదే**

నీరగట్టు అనూష (రూ.2.10 లక్షలు, బ్యాటర్), కంద్రేగుల దేవిక (రూ.2 లక్షలు, ఆల్‌రౌండర్), కాట్రగడ్డ దీక్ష (రూ.1.90 లక్షలు, వికెట్‌కీపర్), షబ్నమ్ షకీల్ (రూ.1.30 లక్షలు, ఆల్‌రౌండర్), పి.రంగ లక్ష్మి (రూ.లక్ష, బ్యాటర్), తరుణి జోషి (రూ.1.20 లక్షలు, ఆల్‌రౌండర్), కట్టా మహంతి శ్రీ (రూ.85 వేలు, బ్యాటర్), కె.హంస (రూ.60 వేలు, ఆల్‌రౌండర్), అంకం విష్ణు ప్రియ (రూ.60 వేలు, బ్యాటర్), హేమ సాయి రమ్య (రూ.55 వేలు, ఆల్‌రౌండర్), సాయి పూజిత (రూ.50 వేలు, ఆల్‌రౌండర్), నక్కా సనా (రూ.45 వేలు, బౌలర్), ఓరుగంటి సాహితి శ్రీ (రూ.40 వేలు, ఆల్‌రౌండర్), ఎం.రుక్సార్ తబస్సుమ్ (బౌలర్), సాయి దీప్తి (ఆల్‌రౌండర్), బొడ్డుపల్లి తనిష్క (ఆల్‌రౌండర్), టి.మల్లిక (ఆల్‌రౌండర్), ఎం.సహస్ర రెడ్డి (రూ.30 వేలు, ఆల్‌రౌండర్).

# సీఎస్కేలో వాటాల కొనుగోలుకు ధోని ఆసక్తి..?



మహేంద్ర సింగ్ ధోని-సీఎస్కే బంధం ఈనాటిది కాదు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ తొలి ఎడిషన్ నుంచి టీమ్ఇండియా మాజీ కెప్టెన్ ఈ ఫ్రాంచైజీతోనే కొనసాగుతున్నాడు. ఎల్లో జెర్సీలో చెన్నై సూపర్ కింగ్స్‌కు ఎన్నో రికార్డులు అందిస్తూ అభిమానులను అలరిస్తున్నాడీ తలా. ఇప్పుడు ఈ బంధాన్ని మహీ మరింత బలంగా మార్చుకోవాలనుకున్నాడు. ఇందుకోసమే సీఎస్కే ఫ్రాంచైజీలో వాటాలు కొనుగోలు చేసేందుకు ధోని ప్రయత్నించినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, ధోని కోరుకున్నంత వాటా ఇచ్చేందుకు ఫ్రాంచైజీ సుముఖంగా లేదని తెలిపాయి. తొలుత సీఎస్కేలో 25 శాతం వాటా కొనుగోలు చేస్తానని ధోని ప్రతిపాదన చేసినట్లు సమాచారం. కానీ, 3 శాతం వాటానే విక్రయిస్తామని యాజమాన్యం చెప్పిందట. ఆ తర్వాత ధోని తన డిమాండ్‌ను 20 శాతానికి తగ్గించుకున్నటికీ.. సీఎస్కే అందుకు అంగీకరించలేదని తెలుస్తోంది. అయితే, ధోని-సీఎస్కే మధ్య ఈ చర్చలన్నీ మాటపూర్వకంగానే జరిగినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఎలాంటి రాతపూర్వక ప్రతిపాదనలు చేయలేదని పేర్కొన్నాయి. కాగా.. ఈ పరిణామాల నేపథ్యంలో సీఎస్కేతో ధోని సంబంధాలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. 2025 ఐపీఎల్ మెగా వేలానికి ముందు రూ.4 కోట్లతో ధోనిని సీఎస్కే రిటైన్ చేసుకుంది. అయితే, గాయం కారణంగా ఈ ఏడాది సీజన్‌లో అతడు ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోవడం గమనార్హం.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com